సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేరుస్తోంది. విశాఖ, మంగళగిరి, విజయవాడలో 60 వేల మంది పేదలకు రూ.52 వేల కోట్ల విలువైన భూములకు పట్టాలు అందించి పట్టాభిషేకం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కింది.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



గురువారం 01.10.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 161 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00





# యువతకు ఉద్యోగాలే మా ఎజెండా

## 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ముందుకు

## విద్యతోనే ఉపాధి సమస్యకు పరిష్కారం

## పరిశ్రమలతో కలిసి నైపుణ్యాల అభివృద్ధి

## ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్-2026లో మంత్రి నారా లోకేశ్

**కొచ్చి (కేరళ) (జర్నలిస్ట్ ఫైల్):** యువత మమ్మల్ని అడుగుతున్న ఒకే ఒక్క విషయం ఉద్యోగాల కల్పన. అందుకే మా ప్రభుత్వం ఉద్యోగాల కల్పనే ప్రధాన ఎజెండాగా పెట్టుకుంది. ముఖ్యమంత్రి నుంచి చివరి స్థాయి ఉద్యోగి వరకు అందరూ ఉద్యోగాల సృష్టిపైనే పనిచేస్తున్నారు. యువత కలల సాకారం కోసమే 20 లక్షల ఉద్యోగాల లక్ష్యం నిర్ణయించామని ఏపీ విద్య,ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్ 2026లో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు, ఇండియా టుడే కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్ దీప్ సర్దేశాయ్ అధిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానాలిచ్చారు. డీఎస్సీపై రాజకీయ నిరుద్యోగులే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు, వాస్తవానికి వారు ఆరోపిస్తున్న స్పోర్ట్స్ సర్టిఫికెట్లన్నీ గత వైసీపీ ప్రభుత్వంలో జారీచేసినవేనన్నారు. క్వాంటమ్ అనేది ఊహ కాదు, నెక్ట్స్ జెనరేషన్ టెక్నాలజీ. ఆంధ్రప్రదేశ్ దాన్ని అందిపుచ్చుకుంది. తొలి 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతిలో ఏర్పాటు చేయబోతున్నాం. దానిపై పరిశోధనలు, మెటీరియల్ సైన్స్, క్రయోజెనిక్ టెక్నాలజీ వంటి రంగాల్లో పని చేసి క్వాంటమ్ ఎకోసిస్టమ్‌ను నిర్మించాలనుకుంటున్నామని చెప్పారు. తాను క్రికెట్ చూడటానికి వెళ్లినపుడు కూడా పారిశ్రామికవేత్తలతో చర్చలు జరిపి పెట్టుబడులు రాబట్టినట్లు మంత్రి లోకేష్ తెలిపారు.

**ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్ -2026లో** రాజ్ దీప్ ప్రశ్నలు -- మంత్రి లోకేష్ సమాధానాలు

**రాజ్ దీప్ సర్దేశాయ్:** ఎలక్షన్ కమిషన్ విషయంలో టీడీపీ వైఖరి ఏంటి? ఎన్నికల సంఘంపై వివాదం మొదలైన వెంటనే మీ లోక్‌సభ నేత కూడా పారదర్శకత కోసం ఎన్నికల సంఘం వివరణ ఇవ్వాలని కోరారు. ఇప్పుడు పరిస్థితి అంతా సర్దుకున్నట్లుగా కన్పిస్తోంది, టీడీపీకి ఎన్నికల సంఘంతో ఎలాంటి సమస్య లేనట్టుగా ఉంది. అసలు టీడీపీ వైఖరి ఏమిటి? ప్రతిపక్షం డిమాండ్ చేస్తున్నట్లుగా జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి తప్పుకోవాలని మీరు భావిస్తున్నారా?

**నారా లోకేష్:** వ్యవస్థను ప్రశ్నించే వారికి కొంత బాధ్యత కూడా ఉండాలన్నది నా అభిప్రాయం. ప్రస్తుతం చాలా రాజకీయ పార్టీలు S.I.R. గురించి ప్రశ్నిస్తున్నాయి. టీడీపీ కూడా ఒక రాజకీయ పార్టీగా S.I.R.కు సంబంధించిన వివిధ అంశాలపై ఎప్పటికప్పుడు వివరణలు కోరింది. నిజానికి దాదాపు ఏడాది క్రితమే మేము అనేక అంశాలపై వివరణ కోరాం. ఎందుకంటే మేము కూడా మా రాష్ట్రంలో S.I.R. ప్రక్రియను ఎదుర్కొన్నాం. వ్యవస్థ పూర్తిగా పరిపూర్ణమా అంటే ఖచ్చితంగా కాదు. ఏ వ్యవస్థలోనైనా మెరుగుపరచాల్సిన అంశాలు ఉంటాయి. అయితే దాన్ని మెరుగుపరచాలనే ప్రయత్నం జరుగుతోంది. ఎన్నికల సంఘం ఇచ్చిన వివరణను టీడీపీ పరిశీలించింది. అది సక్రమంగానే ఉందని మేము భావిస్తున్నాం. ఇక ముందు కూడా ఈ ప్రక్రియను మరింత మెరుగుపరచడానికి మావంతు సలహాలు, సూచనలు ఇస్తాం. కొంతమంది ఓటర్లు మరణించడం, కొంతమంది నివాసాలు మార్చుకోవడం వల్ల కొన్ని అనుమానాలకు, సందేహాలకు అవకాశం ఉండొచ్చు. కానీ మేము మా రాష్ట్రంలో ఈ ప్రక్రియను ఎదుర్కొన్నాం. మా పార్టీ 92 శాతం ఓట్లను మ్యాప్ చేసింది. ఎన్నికల సంఘం అన్ని రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లతో కలిసి ఓటర్ల మ్యాపింగ్ చేస్తుంది. మేము అవసరమైన పత్రాలను సమర్పించాం. ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొన్నాం.

**రాజ్ దీప్ సర్దేశాయ్ :** రాహుల్ గాంధీ చెబుతున్నట్లుగా ఎన్నికల సంఘం బీజేపీ లేదా చీణూ నాయకత్వం ఆదేశాల మేరకు పనిచేస్తోందన్న వాదన మీరు అంగీకరించరా? బీజేపీ ప్రతి ఎన్నికలో గెలిచేలా జ్ఞానేశ్ కుమార్‌ను నియమించారని ఆయన ఆరోపిస్తున్నారు.

**నారా లోకేష్:** అలా వ్యవస్థను మార్చి ఉంటే కేరళలో బిజెపి ఎందుకు ఓడిపోయింది? తెలంగాణలో ఎందుకు ఓడిపోయింది? పార్లమెంట్

మిగతా 2లో...




# పేదలకు పట్టాభిషేకం



**విజయవాడ, సెప్టెంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్):** ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రజలు వేసిన ప్రతీ ఓటుకూ న్యాయం చేస్తూ ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ జెట్ స్పీడుతో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ ముందుకు వెళ్తోందని వ్యాఖ్యానించారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో నిర్వహించిన పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న సీఎం దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న భూములకు హక్కులు కల్పిస్తూ పేదలకు పట్టాలు పంపిణీ చేశారు. బహిరంగ సభలో ఏర్పాటు చేసిన ర్యాంపుపై

మిగతా 2లో...

**26,401 కుటుంబాలకు భూములపై హక్కులు**

**రూ.28,112 కోట్ల విలువైన 707 ఎకరాల భూములకు పట్టాలు**

**ఇప్పటివరకు 60 వేల మంది పేదలకు హక్కులు**

**విజయవాడ బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

## ప్రతి చుక్కా సద్వినియోగం



- తాగు, సాగు, పరిశ్రమలకు నీటి భద్రత
- ప్రాజెక్టుల నుంచి పంట కాల్వల వరకు పక్కా ప్రణాళిక
- విశాఖ నీటి అవసరాలకు స్వల్ప, దీర్ఘకాలిక చర్యలు
- జలవనరుల శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష

2 లో

## ఉద్యోగులకు నిరంతరం నైపుణ్య శిక్షణ

- ఐఐటీ, ఐఐఎంలతో శిక్షణ ఇప్పించాలి
- కెపాసిటీ బిల్డింగ్‌లో ఏపీ అగ్రస్థానంలో ఉండాలి
- ఐగాట్ కర్మయోగి ద్వారా వివిధ కోర్సుల్లో శిక్షణ
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



2 లో

# వృద్ధులకు సర్కార్ వైద్యంతో భరోసా

- 2025-26లో వృద్ధులకు 1.10 కోట్ల ఆరోగ్య పరీక్షలు
- 2026-27లో ఇప్పటి వరకు 52.79 లక్షల సేవలు
- 74 వృద్ధాశ్రమాల్లో ని వృద్ధుల సమగ్ర ఆరోగ్య అంచనా
- అక్టోబర్ నెలలో వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు: మంత్రి సత్యకుమార్ యాదవ్

**అమరావతి, సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని వృద్ధులకు వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వృద్ధులు ఆసుపత్రులకు వచ్చే వరకు వేచి చూడకుండా వారి వద్దకే వెళ్లి వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు, ఫిజియోథెరపీ, పునరావాస సేవలు అందిస్తున్నామని చెప్పారు. గ్రామస్థాయి నుంచి జిల్లా ఆసుపత్రుల వరకు వృద్ధుల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక సేవలు అందుబాటులో ఉంచామన్నారు.

మిగతా 3 లో



## మైనారిటీల కోసం "రిఫార్మ్ ఉత్సవ్"

- భారీగా తరలిరావాలని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపు

**అమరావతి, సెప్టెంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్):** కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు అనుబంధమైన 'నేషనల్ మైనారిటీస్ డెవలప్‌మెంట్ & ఫైనాన్స్ కార్పొరేషన్'

మిగతా 3లో...



## రబీ పంటలకు ధర భరోసా

- 2027-28 మార్కెటింగ్ సీజన్‌కు ఎంఎస్‌పీ పెంపు
- కుసుమకు అత్యధికంగా రూ.675 పెంపు
- నూనెగింజలు, పప్పుధాన్యాలకు ప్రోత్సాహం
- కేంద్ర కేబినెట్ నిర్ణయాన్ని స్వాగతించిన మంత్రి అచ్చెన్నాయుడు

3 లో




## శబరిమలై భక్తుల సమస్యలు తీర్చాలి



- సీఎం చంద్రబాబుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వినతి
- ఏపీ భక్తులకు రవాణా, దర్శనం, వసతులు కల్పించాలి
- ప్రత్యేక సమన్వయ వ్యవస్థ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** శబరిమలై యాత్రకు వెళ్లే ఆంధ్రప్రదేశ్ భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి వినతిపత్రం అందజేశారు.

మిగతా 3లో...

## పేదలకు శాశ్వత భూహక్కులు

- దశాబ్దాల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- 26,401 కుటుంబాలకు పట్టాలు.. రూ.28,110 కోట్ల ఆస్తి హక్కులు
- రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ.50 వేల కోట్ల విలువైన హక్కుల పంపిణీ
- పేదల ఆస్తి భద్రతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడ అజిత్ సింగ్ నగర్ లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో బుధవారం కొండలు, కాలువగట్లు, ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న పేదలకు పట్టాభిషేకం కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరై లబ్ధిదారులకు పట్టాలను అందించారు.

మిగతా 4లో...



## రైతులకు కేంద్రం శుభవార్త

- రబీ పంటలకు పెరిగిన కనీస మద్దతు ధరలు
- గోధుమలకు రూ.2,610.. ఆవాలకు రూ.6,613.. మసూర్ పప్పుకు రూ.7,390

4 లో

## జర్నలిస్టుల భద్రతకు హైపవర్ కమిటీ

- దాడులు, హత్యలు, వేధింపుల కేసుల పరిశీలన
- భద్రత, సంక్షేమ సమస్యల పరిష్కారానికి సిఫార్సులు
- రాష్ట్ర హోంమంత్రి చైర్మన్‌గా కమిటీ ఏర్పాటు

4 లో

## రూ.లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్ ప్రారంభం




- అక్టోబర్ 2న సీఎం చంద్రబాబుశ్రీకారం
- రైజింగ్ రాయలసీమే లక్ష్యంగా కూటమి పాలన
- జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత

**పులివెందుల/కడప (జర్నలిస్ట్ ఫైల్) :** రూ. లక్ష కోట్లతో ఏర్పాటు చేయనున్న హార్టీ కల్చర్ హాబ్ తో దేశంలోనే రాయలసీమ ఉద్యానవన సాగులో నెంబర్ వన్ గా నిలవనున్నదని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత తెలిపారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా వచ్చే నెల రెండో తేదీన మదనపల్లెలో సీఎం చంద్రబాబునాయుడు హార్టీకల్చర్ హబ్ కు శ్రీకారం చుడుతున్నారన్నారు.

మిగతా 3లో...

# యువతకు ఉద్యోగాలే మా ఎజెండా

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికలను చూస్తే అనేక రాష్ట్రాల్లో బీజేపీకి మెజారిటీ స్థానాలు వచ్చాయి. కేరళలో కూడా పరిస్థితి భిన్నంగా ఉంది. కాబట్టి రాజకీయంగా ఓడిపోయినప్పుడు ఎన్నికల సంఘాన్ని నిందించడం సులభం. గెలిచినప్పుడు మాత్రం గెలుపునకు అనేక కారణాలు చెబుతారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు ఓటర్ల జాబితాలో ఉండటం చాలా ముఖ్యం. ఒక రాజకీయ పార్టీగా మేము ఓటర్ల జాబితా ప్రాముఖ్యతను అర్థం చేసుకున్నాం. మేము వాస్తవాలు, డేటా ఆధారంగానే మాట్లాడతాం. మా వైఖరి చాలా స్పష్టంగా ఉంది. మేము మా అభిప్రాయాలను ఎప్పటికప్పుడు వ్యక్తం చేశాం. ఎన్నికల సంఘాన్ని అనేకసార్లు కలిశాం. ఎస్.ఐ.ఆర్. ఒక నిర్దిష్ట విధానంలో జరగాలని మా అభిప్రాయాన్ని చెప్పాం. మా సూచనలు వారి ముందున్నాయి. మా అభిప్రాయం ఎక్కడా మారలేదు.

**రాజ్ దీప్ సర్దేశాయ్ :** ఇప్పుడు Gen Z గురించి, యువ భారతంలో కనిపిస్తున్న అసంతృప్తి గురించి మీ అభిప్రాయం ఏమిటి?

**నారా లోకేష్ :** ప్రస్తుతం భారతదేశంలో ఒక కొత్త ఉద్యమం వస్తోందని నేను భావిస్తున్నాను. దీనికి కులం, మతం, ప్రాంతంతో సంబంధం లేదు. ఇది జనరేషన్ ఆధారిత మార్పు. వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉందని భావిస్తున్న యువత ఒక వర్గంగా ఏర్పాటై ఉద్యమిస్తోంది. మా ప్రభుత్వంలో కూడా ఇంకా మెరుగుపరచాల్సిన అనేక అంశాలు ఉన్నాయి. ఇప్పుడు మనం సమస్యలను గుర్తించాం. మనం ఎక్కడ ఉన్నామో అర్థం చేసుకున్నాం. యువతతో కలిసి వాటికి పరిష్కారాలు కనుగొనడం నాకు చాలా ఉత్సాహాన్నిస్తుంది. యువత కోరుతున్నది - జాబ్స్.. జాబ్స్.. జాబ్స్.

**రాజ్ దీప్ సర్దేశాయ్ :** 2024 ఎన్నికలకు ముందు యువతకు అనేక హామీలు ఇచ్చారు. యువత ఇప్పటికీ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాల సమస్యను పరిష్కరించేందుకు మీరు ఏం చేస్తున్నారు? విద్యాశాఖ మంత్రిగా 'క్యాంటీన్ పే చర్చ' వంటి కార్యక్రమాలు చేస్తున్నారు. కాలేజీలకు వెళ్తున్నారు. యువత మీతో ఏం చెబుతోంది?

**నారా లోకేష్:** ఈరోజు యువత మమ్మల్ని అడుగుతున్న ఒకే ఒక్క విషయం మరిన్ని ఉద్యోగాలు కల్పించండి. అందుకే మా ప్రభుత్వం కూడా ఉద్యోగాల కల్పనే ప్రధాన ఎజెండాగా పెట్టుకుంది. ముఖ్యమంత్రి నుంచి చివరి స్థాయి అధికారి వరకు అందరూ ఉద్యోగాల సృష్టిపైనే పనిచేస్తున్నారు. యువత కలల సాకారం కోసమే 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యం నిర్ణయించాం. ఉద్యోగాల సమస్యకు పరిష్కారం విద్యతో ప్రారంభమవుతుంది. మేము విద్యా పాఠ్యాంశాలను పూర్తిగా పునఃపరిశీలిస్తున్నాం. పరిశ్రమలతో కలిసి ఉద్యోగాలు సృష్టిస్తున్నాం. గత ఏడాది కాలంలో భారతదేశానికి వచ్చిన పెట్టుబడుల్లో దాదాపు 25 శాతం ఆంధ్రప్రదేశ్‌కి వచ్చాయి. ఇదే మమ్మల్ని ఇతర రాష్ట్రాల కంటే ప్రత్యేకంగా నిలబెడుతోంది. కొత్తగా ఎనర్జీ రంగాన్ని అభివృద్ధి చేస్తున్నాం. LG, Premier Energy వంటి సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించాయి. ఈ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు యువతలో పెంచుతున్నాం. హార్టికల్చర్ నుంచి క్వాంటమ్ కంప్యూటింగ్ వరకు అన్ని రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించాం. ప్రతి రంగానికి ప్రత్యేక క్లస్టర్, మిషన్, ఫోకస్ ఉంది. మేము అదే విధానాన్ని అనుసరిస్తున్నాం. Skyroot వంటి సంస్థలు ఎక్కువ మందికి తెలియకముందే మేము వారిని ఏపీకి ఆహ్వానించడానికి ప్రయత్నించాం. పెట్టుబడులను ఆకర్షించడమే కాదు, కంపెనీలను వెతికి, వెంటపడి, పూర్తి ఎకోసిస్టమ్ నిర్మించేలా చేస్తున్నాం.

**రాజ్ దీప్ సర్దేశాయ్ :** టీచర్ రిక్రూట్‌మెంట్ పరీక్షల విషయంలో ప్రతిపక్షం ఆరోపణలు చేస్తోంది. దేశంలో పరీక్షల నిర్వహణ విధానాన్ని పూర్తిగా సమీక్షించాల్సిన అవసరం ఉందా? ఇటీవల డీఎస్సీపై ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలకు మీ సమాధానం ఏమిటి?

**నారా లోకేష్:** రాజకీయ నిరుద్యోగులే డీఎస్సీపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ పరీక్షను అత్యంత పారదర్శకంగా నిర్వహించాం. ఇది కంప్యూటర్ ఆధారిత పరీక్ష. ఒక్క ఆరోపణ కూడా ఇప్పటివరకు నిరూపించలేదు. గత ప్రభుత్వంలో క్రీడా కోటాలో ఎంపికైన విద్యార్థులకు అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలే సర్టిఫికెట్లు ఇచ్చారు. ఇప్పుడు అదే అంశంపై ఆరోపణలు చేస్తున్నారు. క్రీడా కోటా అంశంపై వారు కోర్టుకు వెళ్లారు, CBI దర్యాప్తు కోరారు. మేము ఎలాంటి తప్పు చేయలేదు, కోర్టు ఏ ఆదేశం ఇచ్చినా దానికి సిద్ధంగా ఉన్నాం.

**రాజ్ దీప్ సర్దేశాయ్ :** దేశంలోని విద్యా వ్యవస్థ పూర్తిగా మార్చాల్సిన అవసరం ఉందని మీరు భావిస్తున్నారా?

**నారా లోకేష్ :** ఖచ్చితంగా. నేను మీతో ఏకీభవిస్తున్నాను. విద్యా వ్యవస్థ నిన్నటి అవసరాలకు కాకుండా రేపటి అవసరాలకు అనుగుణంగా మారాలి. ఇది చాలా సీరియస్‌గా తీసుకున్నాం. 16వేల మంది టీచర్లను అత్యంత పారదర్శకమైన విధానంలో నియమించాం. ఇప్పుడు ప్రతి విద్యార్థికి సంబంధించిన డేటా మా వద్ద ఉంది. పిల్లలు చదువు మధ్యలో మానేయకుండా చూసేందుకు ఈ డేటాను ఉపయోగిస్తున్నాం.

**రాజ్ దీప్ సర్దేశాయ్:** గ్రామీణ ప్రాంతాల్లో చదివే పిల్లలను AI ఆధారిత ప్రపంచానికి ఎలా సిద్ధం చేస్తారు?



**నారా లోకేష్:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన– ప్రతి కుటుంబం AIని ఉపయోగించేవారిగా ఉండాలి లేదా AIకి సంబంధించి ఒక ఉపయోగకరమైన వినియోగం ఉండాలి. విద్యాశాఖ ద్వారా AI నుంచి క్వాంటమ్ వరకు భవిష్యత్ టెక్నాలజీలపై విద్యార్థులకు పరిచయం కల్పిస్తున్నాం. కంప్యూటర్ ల్యాబ్స్ ఏర్పాటు చేస్తున్నాం. విద్యార్థులకు కొత్త టెక్నాలజీలపై అవగాహన కల్పిస్తున్నాం. అయితే ఇది ఒక్కరోజులో జరిగే మార్పు కాదు. విద్యా వ్యవస్థను సంస్కరించడానికి కనీసం ఒక దశాబ్ద కాలం పడుతుంది.

**రాజ్ దీప్ సర్దేశాయ్:** ప్రజాప్రతినిధులు కాలేజీలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడటం సరైన మార్గమని భావిస్తున్నారా?

**నారా లోకేష్ :** ప్రతి ప్రభుత్వం యువత మనోభావాలను వినాలి. ఆంధ్రప్రదేశ్‌లో మేము అదే చేస్తున్నాం. నేను కూడా ఎలాంటి అజెండా లేకుండా కాలేజీలకు వెళ్తాను. విద్యార్థులతో ఓపెన్‌గా మాట్లాడుతాను. ఇటీవల నర్సరావుపేటలో విద్యార్థులు క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సులు కావాలని అడిగారు. వారికోసం ×దీవీతో మాట్లాడి వారికి క్యాప్సూల్ కోర్సులు తీసుకొచ్చాం. వాటికి క్రెడిట్ కూడా లభిస్తుంది. యువత చెప్పేది వినడం ద్వారా మంచి ఆలోచనలు వస్తాయి.

**రాజ్ దీప్ సర్దేశాయ్ :** అమరావతిని క్వాంటమ్ వ్యాలీగా మార్చాలన్న చంద్రబాబు నాయుడు గారి ఆలోచన కలగానే మిగులుతుందా? వాస్తవ రూపం దాల్చుతుందా?

**నారా లోకేష్ :** హైదరాబాద్‌లో IT గురించి చంద్రబాబు మాట్లాడినప్పుడు కూడా చాలా మంది ఇలాగే ప్రశ్నించారు. బెంగళూరు ఇప్పటికే చాలా ముందుంది అన్నారు. కానీ ఒక నాయకుడి దార్శనికత ఒక ఆర్థిక వ్యవస్థను మార్చగలదు. ఒక్క చొరవ మొత్తం నగర భవిష్యత్తును మార్చేసింది. క్వాంటమ్ అనేది ఊహ కాదు. ఇది నెక్స్ట్ జెనరేషన్ టెక్నాలజీ. భారతదేశానికి క్వాంటమ్ మెషీన్ వచ్చింది. కానీ ఏ రాష్ట్రం దాన్ని తీసుకోలేదు. ఆంధ్రప్రదేశ్ దాన్ని అందిపుచ్చుకుంది. తొలి 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతిలో ఏర్పాటు చేయబోతున్నాం. దానిపై పరిశోధనలు, మెటీరియల్ సైన్స్, క్రయోజెనిక్ టెక్నాలజీ వంటి రంగాల్లో పని చేసి క్వాంటమ్ ఎకోసిస్టమ్‌ను నిర్మించాలనుకుంటున్నాం.

**రాజ్ దీప్ సర్దేశాయ్ :** ఇతర రాష్ట్రాల కంటే ఏపీకి పెట్టుబడులు రావడానికి మీరు ఏం కొత్తగా అందిస్తున్నారు?

**నారా లోకేష్:** పెట్టుబడుల కోసం మేం 3S మంత్రాన్ని అనుసరిస్తున్నాం. అదే స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. ప్రాజెక్ట్ ప్రతిపాదనలను క్లియర్ చేసే వేగంలో ఏపీ కొత్త ప్రమాణాలను పాటిస్తోంది. రెండోది సర్వీస్. పెట్టుబడిదారులకు వారి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం. ప్రతి ప్రాజెక్ట్‌ను జు్ౕరా వ్యవస్థ ద్వారా సమీక్షిస్తున్నాం. మూడవది స్టెబిలిటీ. ప్రభుత్వాలు మారితే పాలసీలు కొనసాగుతాయా అనేది పెట్టుబడిదారులకు ఉన్న సందేహం. అందుకే స్థిరమైన పాలసీ ఫ్రేమ్‌వర్క్‌ను అందిస్తున్నాం.

**రాజ్ దీప్ సర్దేశాయ్:** డేటా సెంటర్లకు అవసరమైన నీరు, విద్యుత్ వంటి మౌలిక వనరుల విషయంలో భవిష్యత్తు సవాళ్లను ఆలోచించారా? లేక పెట్టుబడులు రావాలనే తొందరలో ముందుకు వెళ్తున్నారా?

నారా లోకేష్: మేము తొందరలో ఉన్నామా అంటే ఖచ్చితంగా ఉన్నాం. మన దగ్గర ఐదేళ్ల సమయం మాత్రమే ఉంది. ప్రస్తుత తరం మార్పును చూడాలనుకుంటోంది. యువత కూడా తొందరలో ఉంది. వారు త్వరగా ఫలితాలు చూడాలనుకుంటున్నారు. వేగం మా ప్రధాన లక్షణం. అదే సమయంలో క్లస్టర్ ఆధారిత విధానంతో ముందుకు వెళ్తున్నాం. నీటి, విద్యుత్ అవసరాలను ముందుగానే ప్రణాళిక చేస్తున్నాం. గూగుల్ తో సహా చాలా డేటా సెంటర్లు ఎయిర్–కూల్డ్ డేటా సెంటర్లుగా ఉంటాయి. అవి వినియోగించే నీటి పరిమాణం ఐటీ సెంటర్ ఉపయోగించే నీటితో సమానంగా ఉంటుంది. అందువల్ల మేము దీనికి ప్రణాళిక చేస్తున్నాం. మేం కేవలం డాటా సెంటర్లపై మాత్రమే దృష్టిపెట్టడంలేదు. దేశీయ ఐటీ కంపెనీలతో పాటు స్టీల్, సిమెంట్, ఆక్వా, ఫార్మా, మెడికల్ డివైసెస్ తయారీ రంగాల్లోనూ పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం. వ్యవసాయం నుంచి క్వాంటమ్ వరకు 23 క్లస్టర్లలో పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాం. ఒక క్లస్టర్‌ను నిర్మించడానికి అవసరమైన అన్ని రంగాలను తీసుకురావాలి. ఎండ్–టు–ఎండ్ ఎకోసిస్టమ్‌ను నిర్మించాలి.

**రాజ్ దీప్ సర్దేశాయ్ :** మీరు విద్యాశాఖ మంత్రిగా ఉన్నారు. గత రెండేళ్లలో విద్యా రంగంలో ఏం జరిగింది?

**నారా లోకేష్ :** నేను స్టాన్‌ఫోర్డ్‌లో ఎంబీఏ చేశాను. అందుకే విద్యాశాఖను ఎంచుకున్నాను. సమాజానికి పెద్ద స్థాయిలో తిరిగి సేవ చేయగలనని భావించి విద్యాశాఖను ఎంచుకున్నాను. గత ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లారని గణాంకాలు చెబుతున్నాయి. గత రెండేళ్లలో 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు తిరిగి వచ్చారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి నిర్ణయాల్లో ఒకటి ఉపాధ్యాయుల నియామకం. 16వేల మంది ఉపాధ్యాయులను నియమించి, శిక్షణ ఇచ్చి, పాఠశాలల్లో నియమించాం. మా ఉపాధ్యాయులు చాలా ఉత్సాహంగా పనిచేస్తున్నారు. గత ఏడాది మా పనితీరు మెరుగ్గా ఉంది. ఇప్పుడు గత పనితీరు నుంచి అత్యుత్తమ స్థాయికి వెళ్లాలి. ఆ దిశగా నిర్మాణాత్మకంగా అడుగులు వేస్తున్నాం.

**రాజ్ దీప్ సర్దేశాయ్ :** రియల్ టైమ్ గవర్నెన్స్ అంటే ఏమిటి? ఇది కేవలం మంచి మార్కెటింగ్ పేరా?

**నారా లోకేష్:** రియల్ టైమ్ గవర్నెన్స్ అనేది ఒక శాఖ. ఇందులో వివిధ మంత్రిత్వ శాఖల నుంచి వచ్చే డేటాను ఒకచోట సమీకరించి ఒక డేటా లేయర్‌ను రూపొందిస్తాం. ఆ తర్వాత అవసరమైన అంశాలపై సంబంధిత మంత్రులు, శాఖలకు సూచనలు, అలర్ట్‌లు, అడ్వైజరీ నోట్స్ ఇస్తాం. విద్యుత్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రుల్లో తగినంత మందులు ఉన్నాయా అనే అంశం వరకు డేటాను విశ్లేషిస్తాం. అదే మమ్మల్ని ఇతర రాష్ట్రాల నుంచి భిన్నంగా నిలబెడుతోంది.

**రాజ్ దీప్ సర్దేశాయ్ :** రైతులకు రియల్ టైమ్ గవర్నెన్స్ ఎలా ఉపయోగపడుతుంది?

**నారా లోకేష్:** ఇందుకు నీటి నిర్వహణ ఒక మంచి ఉదాహరణ. గోదావరి, కృష్ణా నదుల నుంచి వాతావరణ అంచనాల ఆధారంగా నీటిని ఎలా తరలించాలి? నష్టాలను ఎలా తగ్గించాలి? అనే అంశాల్లో డేటా ఉపయోగపడుతుంది. వాతావరణ అంచనాల ఆధారంగా రైతులకు ఎప్పుడు విత్తాలి, ఏ పంటలు వేయాలి అనే సూచనలు ఇవ్వవచ్చు. ఎల్‌నినో వస్తే విద్యుత్ డిమాండ్ పెరుగుతుంది. దానికి ముందుగానే సిద్ధం కావాలి.

మేము కూడా ఒక శాఖగా నేర్చుకుంటున్నాం. విద్యుత్ ప్రణాళిక విషయంలో మేము ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించలేకపోయాం. ఎనర్జీ ప్లానింగ్‌లో ఇంకా సామర్థ్యాన్ని పెంచుకోవాలి. ఆ దిశగా పనిచేస్తున్నాం.

**రాజ్ దీప్ సర్దేశాయ్:** దేశంలోని అనేక రాష్ట్రాలు ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. నీతి ఆయోగ్ ఫిస్కల్ హెల్త్ ఇండెక్స్‌లో ఆంధ్రప్రదేశ్ 18 ప్రధాన రాష్ట్రాల్లో 17వ స్థానంలో ఉంది. ఎన్నికల హామీ పథకాలు, ఇతర ఖర్చుల వల్ల ఆర్థిక పరిస్థితిపై ఒత్తిడి ఉందా?

**నారా లోకేష్ :** రాష్ట్రాలకు ఇది ఒక సవాలే. కానీ మరో వైపు కూడా చూడాలి. ఆంధ్రప్రదేశ్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటి. మా జీఎస్టీ వృద్ధి దాదాపు రెండంకెల స్థాయిలో ఉంది. 17–18 శాతానికి పైగా ఉంది. దీర్ఘకాలంలో మా అప్పులను తీర్చగలమనే నమ్మకం ఉంది.

ఓటింగ్ విధానం కేవలం ఎన్నికల హామీల ఆధారంగా మారుతున్నట్లయితే రాజకీయ నాయకులను మాత్రమే ఎందుకు నిందించాలి? ప్రజలు కూడా బాధ్యత వహించాలి. ఒక కుటుంబం పేదరికం నుంచి బయటపడిన తర్వాత ఇక సంక్షేమం అవసరం లేని స్థాయికి రావాలి. వారికి ఉద్యోగాలు ఉండాలి. వారు తమ కుటుంబాలను తాము నిర్వహించుకోగలగాలి. అలాంటి సమాజాన్ని నిర్మించడమే లక్ష్యం.

**రాజ్ దీప్ సర్దేశాయ్:** దక్షిణాది రాష్ట్రాలు తమకు అన్యాయం జరుగుతోందని భావిస్తున్నాయి. జనాభా ఆధారంగా డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాల పార్లమెంట్ ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందని ఆందోళనపై మీరు ఏమంటారు?

**నారా లోకేష్:** ఇది చాలా ముఖ్యమైన అంశం. డీలిమిటేషన్ విషయంలో మేము స్పష్టమైన వైఖరిని తీసుకున్నాం. ప్రస్తుతం పార్లమెంట్‌లో ఉన్న ప్రాతినిధ్యాన్ని కొనసాగించాలి. ప్రాతినిధ్యాన్ని తగ్గించకూడదనేది తెలుగుదేశం పార్టీ వైఖరి. 2026 జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ జరిగితే దక్షిణ భారత రాష్ట్రాలు నష్టపోయే అవకాశం ఉందనే అంశంపై మేము ఆందోళన వ్యక్తం చేశాం.

**రాజ్ దీప్ సర్దేశాయ్ :** రాష్ట్రాలన్నింటిలో 50 శాతం ప్రాతినిధ్యం, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఉంటే మీరు మద్దతు ఇస్తారా?

**నారా లోకేష్:** మహిళలకు రిజర్వేషన్ తీసుకొచ్చిన పార్టీ తెలుగుదేశం పార్టీ. మా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ గారు స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్ తీసుకొచ్చారు. ఇది మాకు కొత్త విషయం కాదు. 40 ఏళ్ల క్రితమే దీనిపై నిర్ణయం తీసుకున్నాం.

**రాజ్ దీప్ సర్దేశాయ్ :** చంద్రబాబు నాయుడు గారు ప్రజలు ఇద్దరికి మించి పిల్లలను కనాలని ఇటీవల చెప్పారు. ఇది గతంలో ఉన్న "హమ్ దో, హమారే దో" ఆలోచనకు పూర్తి విరుద్ధంగా ఉంది. ఎందుకు?

**నారా లోకేష్:** జనాభా నిర్వహణ అనేది జపాన్, సింగపూర్ వంటి దేశాలు ఇప్పటికే ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాళ్లలో ఒకటి. భారతదేశాన్ని ఒకే దేశంగా మాత్రమే చూడకూడదు. ఉత్తర భారతదేశంలో జనాభా పునరుత్పత్తి రేటు ఒక స్థాయిలో ఉంది. దక్షిణ భారతదేశంలో మరో స్థాయిలో ఉంది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు వంటి రాష్ట్రాలు తమ రీప్లేస్‌మెంట్ రేట్‌ను 2.1 వద్ద కొనసాగించాలి. ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం 1.5 వద్ద ఉంది. ఇది మరింత తగ్గే అవకాశం ఉంది. చంద్రబాబు నాయుడు గారు ఈ విషయాన్ని ఇప్పుడు మాత్రమే మాట్లాడటం లేదు. 2019 నుంచే దీనిపై మాట్లాడుతున్నారు. భవిష్యత్తులో అత్యంత ముఖ్యమైన అంశంగా మారబోయే విషయంపై దేశం దృష్టిని ఆకర్షిస్తున్నారు. అదే సమయంలో విద్య నాణ్యతను మెరుగుపరచడం, ఉద్యోగాలు కల్పించడం కూడా ముఖ్యమే.

రాజ్ దీప్ సర్దేశాయ్‌లి : 2024లో ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు మీరు నేర్చుకున్న ఒక ముఖ్యమైన పాఠం ఏమిటి?

**నారా లోకేష్ :** ఇది మంత్రిగా నా రెండో టర్మ్. నేను నేర్చుకున్నది – అపారమైన సహనంతో వినాలి. అన్నివర్గాల వద్దనుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి. ఏ వ్యవస్థా పరిపూర్ణం కాదు. ఒక వ్యవస్థను సరిచేయాలనుకుంటే ఎప్పుడూ కొన్ని అంశాల్లో మెరుగుదలకు అవకాశం ఉంటుంది. ఇదే నేను నేర్చుకున్న ప్రధాన పాఠం.

**రాజ్ దీప్ సర్దేశాయ్ :** మీరు మీ యాప్ ద్వారా పార్టీ కార్యకర్తలకు ఎప్పుడూ స్పందిస్తూ ఉంటారు. మీకు కుటుంబం కూడా ఉంది. ఇంత సమయం ఎలా కేటాయిస్తారు?

**నారా లోకేష్:** ఇది నాకు సులభమైన విషయం కాదు. కానీ నా భార్య నాకు ఎంతో మద్దతు ఇస్తున్నారు. మంత్రిగా ఉన్నప్పటికీ, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నప్పటికీ ఆమె ఎప్పుడూ నాకు అండగా నిలిచారు. ఆమె మద్దతు వల్లే నేను నా పని చేయగలుగుతున్నాను. మై టీడీపీ యాప్ ద్వారా నా సహచరుల నుంచి కూడా ఫీడ్‌బ్యాక్ వస్తుంది.

**రాజ్ దీప్ సర్దేశాయ్ :** మీరు చంద్రబాబు నాయుడు గారి కుమారుడు, ఎన్టీఆర్ గారి మనవడు. ఈ వారసత్వం మీపై ఎప్పుడూ ఒక ఒత్తిడిగా ఉంటుందా? మీరు నిరంతరం మీ సామర్థ్యాన్ని నిరూపించుకోవాల్సి వస్తుందా?

**నారా లోకేష్ :** నేను ఎప్పుడూ ఉన్నత పదవులను ఆశించలేదు. ప్రజల హృదయాలను గెలుచుకోవాలనే లక్ష్యంతోనే పనిచేశాను. ఇప్పుడు ముఖ్యమంత్రి పదవి నా ప్రాధాన్యత కాదు. విద్యా వ్యవస్థను వీలైనంత త్వరగా మార్చడమే ఇప్పుడు నా ప్రాధాన్యత. అదే నన్ను ప్రతిరోజూ ముందుకు నడిపిస్తుంది. పరీక్షలు జరుగుతున్నప్పుడు మొత్తం బృందం అప్రమత్తంగా ఉంటుంది. ఎలాంటి తప్పులు జరగకుండా పర్యవేక్షిస్తాం. ఎందుకంటే అది పిల్లల భవిష్యత్తు. అందుకే నేను ప్రతిరోజూ దానిపైనే దృష్టి పెడతాను.

**రాజ్ దీప్ సర్దేశాయ్ :** పొలిటికల్ బిజీ షెడ్యూళ్ల వల్ల సాధారణ జీవితం, క్రీడలు వంటివి మిస్ అవుతారా?

**నారా లోకేష్ :** ఇదే నా జీవితం. నేను చేస్తున్న పనిని ఆస్వాదిస్తున్నాను. నేను ఏదీ మార్చుకోవాలని అనుకోవడం లేదు. నేను ఎప్పుడూ "ఏబీసీ – ఆల్వేస్ బీ క్లోజింగ్" అని నమ్ముతాను. ఎప్పుడూ ఒక అవకాశాన్ని ముగింపునకు తీసుకెళ్లాలి. నేను క్రికెట్ మ్యాచ్‌కు వెళ్తాను. అక్కడ కూడా ఆంధ్రప్రదేశ్ కోసం పెట్టుబడి ఒప్పందాన్ని ముగిస్తాను. ఒక టీ20 మ్యాచ్‌లో నేను ఎంతమంది పారిశ్రామికవేత్తలను, వ్యాపారవేత్తలను కలిశానో మీరు ఆశ్చర్యపోతారు. వారిలో చాలామంది తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టారు. అందుకే ఏబీసీ – ఆల్వేస్ బీ క్లోజింగ్.

# పేదలకు పట్టాభిషేకం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రులు సత్యకుమార్ యాదవ్, నాదెండ్ల మనోహర్ తో కలిసి నడుస్తూ ప్రజలకు అభివాదం చేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ.." విశాఖపట్నంలో 28 వేల మందికి, మంగళగిరిలో 5,800 కుటుంబాలకు భూములపై హక్కులు కల్పిస్తూ పట్టాలు ఇచ్చాం. ఇప్పుడు విజయవాడలో 26,401 వేల మంది కుటుంబాలకు పట్టాలు ఇస్తున్నాం. మొత్తం కలిపి ఇప్పటి వరకూ 60 వేల మంది పేదలకు పట్టాలు ఇవ్వటం నా అదృష్టంగా భావిస్తున్నాను. రూ. 52 వేల కోట్ల విలువైన భూముల్ని పేదలకు ఇవ్వటం సంతోషంగా ఉంది. పేదలకు జరుగుతున్న పట్టాభిషేకం ఇది. విజయవాడలో ఇస్తున్న భూముల విలువ రూ. 28,112 కోట్లుగా ఉంది. 707 ఎకరాల్లోని 34 లక్షల చదరపు గజాల స్థలానికి పేదలకు హక్కులు కల్పించాం. ఒక్కో స్థలం విలువ రూ. 50 లక్షల నుంచి రూ. 2 కోట్ల వరకూ ఉంటుంది. ఇదే పేదల ఆత్మగౌరవానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న పట్టాభిషేకం. దశాబ్దాలుగా పేదలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి చలించి మీ స్థలాలకు హక్కుల కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నాం. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో పేదలకు పట్టాలు వచ్చేలా కృషి చేసిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు అభినందనలు తెలియచేస్తున్నా. గత పాలనలో ఐదేళ్ల పాటు విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టాం, ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటాం. ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను భవిష్యత్తు కోసం జాగ్రత్తగా కాపాడుకోవాలని అందరికీ సూచిస్తున్నాను. రాష్ట్రంలో దశాబ్దాలుగా ఉన్న భూ సమస్యల్ని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నాం. విశాఖ, వట్టిచెరుకూరు, కంగుమంది, కైకలూరు, అమలాపురం లాంటి చోట్ల ఉన్న ఈ తరహా సమస్యల్ని పరిష్కరించి పట్టాలు ఇచ్చాం." అని ముఖ్యమంత్రి అన్నారు.

**అభివృద్ధికి గొడ్డలి పార్టీ అడ్డంకులు :** "2019–24లో గత పాలకులు ప్రతి ఇంట్లోనూ ఆస్తుల వివాదాలు సృష్టించారు. పట్టాదారు పాస్ పుస్తకాలపై వారి బొమ్మలేసుకున్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో ఇబ్బందులు సృష్టించారు. సర్వేరాళ్లపై బొమ్మలు వేసుకోడానికి రూ. 800 కోట్లు ఖర్చు చేశారు. ఆ డబ్బులు ఉంటే పేదలకు మరింత సంక్షేమం జరిగేది. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో భూములన్నిటిని రీసర్వే చేసి రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నాం. ఎలాంటి వివాదాలు లేని కొత్త వ్యవస్థను తీసుకువచ్చేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. సంక్షేమం– అభివృద్ధి– సంపద సృష్టి అనేది నిరంతరం జరిగేలా వివిధ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఇప్పటికే రూ. 1.50 లక్షల కోట్లు అభివృద్ధికి ఖర్చు చేశాం. వైసీపీ రాక్షసులు పట్టిసీమ ప్రాజెక్టుకు అడ్డంపడ్డారు. కానీ పట్టుదలతో ప్రాజెక్టు పూర్తి చేసి ఇప్పటికే 490 టీఎంసీల నీటిని తీసుకువచ్చాం. ఎల్ నినో కారణంగా కృష్ణా నదిలో శ్రీశైలం, ప్రకాశం బ్యారేజీకి నీరే రాలేదు. పట్టిసీమ నుంచి నీరు తెచ్చి డెల్టా ప్రాంతానికి నీరు ఇచ్చాం. విజయవాడకు కూడా నీటి సమస్య లేకుండా చేయగలిగాం. గోదావరి నదిలో ఈ ఏడాది ఇప్పటి వరకూ 1400 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లాయి. రోజుకు 75 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్తోంది. అందులో ఓ 100 టీఎంసీలు తెచ్చుకుంటే అంతా సస్యశ్యామలం అవుతుంది. పోలవరం ప్రాజెక్టును వచ్చే



ఏడాదికి పూర్తి చేసి గ్రావిటీపై తీసుకువస్తాం. కృష్ణా డెల్టాలో పొదుపు చేసిన నీటిని రాయలసీమ ప్రాంతానికి ఇస్తాం. అన్ని ప్రాంతాలకూ తాగు, సాగునీరు ఇవ్వాలన్నదే మా లక్ష్యం. మనతో పాటు మన పొరుగు రాష్ట్రాల వారు కూడా బాగుండాలన్నదే మా సిద్ధాంతం. గోదావరి – కావేరి నదుల అనుసంధానం జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు నీటి కొరతే రాదు. వచ్చే మూడేళ్లలో రూ. 35 వేలకోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. 2028 కృష్ణా పుష్కరాల నాటికి కృష్ణా–గోదావరి నీళ్లు పుష్కలంగా మనకు వస్తాయి" అని సీఎం వ్యాఖ్యానించారు.

**మహిళా వర్క్ ఫోర్సులో ఏపీ కీలకం :** "అభివృద్ధి భవిష్యత్తులో సంపద సృష్టికి అవసరం. అభివృద్ధి– సంక్షేమమే కూటమి ప్రభుత్వానికి రెండు కళ్లు. ప్రజల ఆదాయాన్ని పెంచేలా మా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పేదల సంక్షేమం మా మొదటి ప్రాధాన్యం ఇస్తున్నాం. ఠంచనుగా మొదటి తేదీనే వారికి పెన్షన్ ఇస్తున్నాం. స్త్రీశక్తి ద్వారా ఆడబిడ్డలకు డబ్బులు ఆదా అవుతున్నాయి. గత పాలకులు రూ. 32 వేల కోట్ల మేర విద్యుత్ ఛార్జీల భారం వేశారు. మేం ట్రూ డౌన్ చేసి విద్యుత్ భారం తగ్గించాం. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చాం. ఆ మాట నిలబెట్టుకున్నాం. అన్నా క్యాంటీన్ ద్వారా పేదల కడుపు నింపేలా మేం చర్యలు తీసుకుంటున్నాం. మత్స్యకారుల సేవలో, ఆటోడ్రైవర్ల సేవలో, నేతన్నల సేవలో కార్యక్రమాల ద్వారా ఆయా వర్గాలకు చేయూత అందుతోంది. వడ్డెర్లు, గీత కార్మికులకు కూడా సహకారం అందిస్తున్నాం. పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా పీ4 కార్యక్రమం తీసుకువచ్చాం. కుప్పంలో ఓ సాధారణ మహిళను టీవీఎస్ కంపెనీ దత్తత తీసుకుంది. నిన్నటి వరకూ కూలీగా ఉన్న ఆ మహిళ ఇటుకల బట్టీ యూనిట్‌ను ఏర్పాటు చేసుకుని 20 మందికి ఉపాధి అందిస్తోంది. కేంద్ర గణాంకశాఖ విమెన్ వర్క్ ఫోర్సుపై ఓ నివేదిక విడుదల చేసింది. విశాఖ మొదటి స్థానంలో ఉంది. ప్రతీ వంద మందిలో 42 మంది మహిళలు ఉన్నారు. విజయవాడలో ప్రతీ వంద మందిలో 37 మంది పనిచేస్తున్నట్టు వెల్లడైంది. పారిశ్రామిక వేత్తలుగా ప్రతీ వంద మందిలో 30 శాతం మంది మహిళలే ఉన్నారు. రాష్ట్రంలో డ్వాక్రా మహిళలు ఉత్పత్తి చేస్తున్న ఉత్పత్తులను స్వయం బ్రాండ్ కింద మార్కెటింగ్ చేయిస్తున్నాం. ఇప్పటికే 5.5 లక్షల ఇళ్లు పూర్తి చేసి లబ్దిదారులకు అందించే వచ్చే ఏడాదిలోగా మరో 5.5 లక్షల ఇళ్లు ఇస్తాం. పేదలందరికీ ఇంటిజాగా, ఇల్లు, తాగునీటికి కుళాయి ఉండేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని" సీఎం వ్యాఖ్యానించారు.

**గ్లోబల్ సిటీస్ ఇండెక్స్‌లో ఏపీ నగరాలు :** పురాణ కాలంలో రాజులు యజ్ఞాలు చేస్తే రాక్షసులు అడ్డుపడే వారు. ఇప్పుడు గొడ్డలి పార్టీ అదే పనిచేస్తోంది. పేదలకు పట్టాలు ఇస్తుంటే ఎలా ఇస్తారంటూ గొడ్డలి పార్టీ అడ్డుపడుతోంది. ఇలా ఏ పనిచేసినా ఆ పార్టీ నేతలు అడ్డుపడుతున్నారు. అమరావతి ప్రజా రాజధాని నిర్మాణాల్ని కూడా ఆ పార్టీ అడ్డుకుంటోంది. ప్రపంచ బ్యాంకులు లేఖలు రాశారు. చెరుకు తోటలు తగులబెట్టారు. ఇలా నానా విన్యాసాలు చేశారు. రాజధాని నిర్మాణానికి నిధులు రాకుండా అడ్డుకునేందుకు ప్రపంచబ్యాంకుకు లేఖలు రాశారు. చెరుకు తోటలు తగలబెట్టారు. నానా విన్యాసాలు చేశారు. మూడు రాజధానులని, అమరావతి శ్మశానమని వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటులో అమరావతికి చట్టబద్ధత వచ్చిన రోజే మావిగన్ అంటూ కొత్త ఆటలు మొదలు పెట్టారు. మావిగన్ అంటే విజయవాడలో ఉన్నవారికైనా అర్థం అయ్యిందా అని ప్రశ్నిస్తున్నా. ఎవరికి ఇష్టం ఉన్నా లేకపోయినా అమరావతి అత్యుత్తమ రాజధాని నగరంగా తయారవుతుంది. విజయవాడకు, అమరావతికి అందం తెచ్చిపెట్టేది నీళ్లే. ఇది బ్లూ సిటీ, 50 శాతం పచ్చదనంతో కళకళలాడేలా నగర నిర్మాణం జరుగుతోంది. రాజధాని అమరావతిలో వినియోగించే విద్యుత్ అంతా గ్రీన్ ఎనర్జీనే. నెట్ జీరోగా నగరాన్ని తీర్చిదిద్దుతున్నాం. విజయవాడ, గుంటూరులో భూములకు విలువ పెరిగింది. ఇన్నర్ రింగ్ రోడ్డు, అవుటర్ రింగ్ రోడ్ల ద్వారా కనెక్టివిటీ పెరుగుతుంది. బుల్లెట్ ట్రైన్ సహా, 4 లేన్ రైల్వే లైన్ వస్తుంది. అమరావతి–విజయవాడ–గుంటూరు ఒకే నగరంగా తయారవుతాయి. మన విజయవాడ ప్రపంచంలోని వెయ్యి నగరాల్లో చోటు సంపాదించింది. నాణ్యమైన జీవన ప్రమాణాలు, మానవ వనరులు, పర్యావరణం లాంటి అంశాల్లో విజయవాడ, గుంటూరు, నెల్లూరు, విశాఖ చోటు సంపాదించాయి. విజయవాడ నగరంలో కాలుష్యం లేకుండా వాటర్ స్ప్రేయింగ్ చేయిస్తున్నాం. విజయవాడ ఎయిర్ పోర్టులో కొత్త టెర్మినల్ తో అత్యద్భుతంగా తీర్చిదిద్దుతున్నాం. మచిలీపట్నంలో గోవాషిప్ యార్డు షిప్ బిల్డింగ్ సెంటర్ నిర్మిస్తోంది. రూ. 8 వేల కోట్ల పెట్టుబడులతో ఈ నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటు చేస్తుంది. ప్రకాశం బ్యారేజి ఎగువన దిగువన వైకుంఠపురం, చోడవరం దగ్గర బ్యారేజీలను నిర్మించి నీటిని నిల్వచేస్తాం. అమరావతికి కనెక్టివిటీ పెరిగేలా వెస్ట్ బైపాస్ తో పాటు మరో బ్రిడ్జి కూడా నిర్మాణం చేస్తాం. రూ. 50 వేల కోట్లతో పట్టణాల్లో అభివృద్ధి కార్యక్రమాలు మొదలు పెట్టాం. గ్రామీణ ప్రాంతాల్లో రూ. 11 వేల కోట్లతో పనులు ప్రారంభించాం

ఒక్క కియా ప్రాజెక్టు అనంతపురంలో, వెలిగొండ మార్కాపురంలో, భోగాపురం విజయనగరంలో మార్పులు తీసుకువస్తున్నాయి. అమరావతి ఈ ప్రాంతంలో భూముల రేట్లు పెరిగాయి. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రోడ్, రైల్ నెట్వర్క్‌లు పూర్తై అవకాశాలను అందిపుచ్చుకోవాలి" అని ముఖ్యమంత్రి అన్నారు.

**పేటీఎం బ్యాచ్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి :** "2019–24 మధ్య కాలంలో విభజన కంటే ఎక్కువగా రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. ఇప్పుడు ఆ కష్టనష్టాలను అధిగమించి వికాసం వైపు మనం ముందడుగు వేస్తున్నాం. ప్రతీ అడుగు స్వర్ణాంధ్ర సాధన దిశగా వేసుకుంటూ ముందుకు వెళ్తున్నాం. ఇక ఎవరి వల్లా రాష్ట్రం నష్ట పోకూడదనే కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపటమే లక్ష్యంగా మేం పనిచేస్తున్నాం. మంచి చేసే ప్రభుత్వాన్ని గుర్తించాలని ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రజా బలమే శ్రీరామ రక్షగా 2024లో మేం అధికారంలోకి వచ్చాం. గొడ్డలి పార్టీని చిత్తుగా ఓడించి శాశ్వతంగా సమాధి చేయాలని కోరుతున్నా. ప్రభుత్వం చేసిన మంచి గురించి ప్రజలు సామాజిక మాధ్యమాల్లో పంచుకోవాలి. పేటీఎం బ్యాచ్‌ల రీల్స్‌తో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారు. లబ్దిపొందిన వారంతా అనుభవాలు పంచుకుంటే సోషల్ మీడియా బద్దలవుతుంది. గతంలో సీఈఓ సీఎం అని పిలిచినా కలగని ఆనందం వాటర్ మాన్ అంటూ చేసిన వ్యాఖ్యతో కలిగింది. పలు సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి సాగునీరు, తాగు నీరందిస్తున్నందుకు వాటర్ మాన్ అంటూ పత్రికలు రాశాయని" సీఎం వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, నాదెండ్ల మనోహర్ సహా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

## ఉద్యోగులకు నిరంతరం నైపుణ్య శిక్షణ



**అమరావతి, సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ నిరంతర ప్రక్రియగా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. క్యాంప్ కార్యాలయంలో బుధవారం వివిధ శాఖలు అందించే సేవలపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్షించారు. ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ, అన్నక్యాంటీన్లు, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం, సంక్షేమ హాస్టళ్లల్లో వసతులు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు కెపాసిటీ బిల్డింగ్, నైపుణ్య శిక్షణలో దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీ అగ్ర స్థానంలో ఉందని సీఎం చెప్పారు. ఐగాట్ కర్మ యోగి ద్వారా వివిధ కోర్సుల్లో శిక్షణ ఇప్పించామని... రియల్ టైమ్‌లో పని చేసేలా ఉద్యోగులు శిక్షణ పొందుతున్నారన్నారు. వివిధ వర్చువల్ కోర్సుల ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఐఏఎస్ అధికారులు ఎప్పటికప్పుడు ఓరియేంటేషన్ తీసుకుంటూ స్కిల్స్ అప్‌గ్రేడ్ చేసుకుంటారో... అదే తరహాలో ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్యాభివృద్ధి ఉండాల్సిందేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగులకు అవసరమైన నైపుణ్య శిక్షణ కోసం ఐఐటీ, ఐఐఎంలతో శిక్షణ ఇప్పించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక తాగునీటి సమస్యను నివారించే విషయంలో ఎంత మాత్రం నిర్లక్ష్యం వహించొద్దని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సమీక్ష సందర్భంగా పట్టణాల్లో తాగునీటి సరఫరా ఎలా ఉందని అధికారులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కాలంలో వర్షాలు పడడంతో పట్టణాల్లో తాగునీటి సమస్య చాలా వరకు తగ్గిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. రాయలసీమలో రెండు మున్సిపాల్టీల్లో కొద్దిపాటి తాగునీటి సమస్య ఉందని.. దాన్ని అధిగమించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇక విశాఖ నగరంలో కూడా గ్రౌండ్ వాటర్ రీఛార్జ్ అయిందని.. తాగునీటి సమస్యను అధిగమిస్తున్నామని అధికారులు వివరించారు. పట్టణాల్లో కానీ.. పల్లెల్లో కానీ తాగునీటి సమస్య ఉత్పన్నం కాకూడదని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. వర్షాలు పడ్డాయని నిర్లక్ష్యంతో ఉండొద్దని సూచించారు. ప్రభుత్వం చేపట్టే వివిధ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వాములను చేయాలని సీఎం చంద్రబాబు చెప్పారు. ఈ సమావేశంలో సీఎస్ సాయి ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి చుక్కా సద్వినియోగం




**అమరావతి, సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ ఫైల్):** వివిధ రంగాలకు నీటి భద్రతే లక్ష్యంగా సమగ్ర నీటి ప్రణాళిక రూపొందించాలని, సాగునీటి ప్రాజెక్టుల పురోగతిలో ఎక్కడా రాజీ పడేది లేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. క్యాంప్ కార్యాలయంలో బుధవారం జలవనరుల శాఖపై సీఎం సమీక్షించారు. రాష్ట్రానికి అవసరమైన సమగ్ర నీటి ప్రణాళికను రూపొందించాలంటూ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... అన్ని రంగాలు, అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళికను రూపొందించాలన్నారు. తాగునీరు, సాగునీరు, పారిశ్రామిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ సమగ్ర ప్రణాళిక ఉండాలన్నారు. ఈ ప్రణాళికలో భాగంగా వివిధ ఇరిగేషన్ ప్రాజెక్టులు మొదలుకుని... పంట కాల్వల వరకూ పూర్తి స్థాయి ప్లాన్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇదే సందర్భంలో ఎత్తిపోతల పథకాలు, మైక్రో ఇరిగేషన్, హైడల్ విద్యుత్ ప్రాజెక్టులు, పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు వంటి వాటిని కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. విశాఖ నగర వాసుల తాగునీరు, పారిశ్రామిక నీటి అవసరాలను తీర్చేందుకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా తాగునీటి సరఫరా కెనాల్ మీదుగా కణితి బాలెన్సింగ్ రిజర్వాయర్ వరకు నీటిని నిరంతరాయంగా పంపే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అలాగే జలశయాల నుంచి విశాఖ నగర పాలక సంస్థ పరిధిలోని ప్రాంతాలకు క్రమం తప్పకుండా నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

**పోలవరానికి పర్యాటక హంగులు :** ఇరిగేషన్ క్యాలెండర్‌లో పొందుపరిచిన ప్రాధాన్యతా ప్రాజెక్టుల కోసం రూ. 35 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని సీఎం వెల్లడించారు. క్యాలెండరులో నిర్దేశించుకున్న విధంగా ప్రాజెక్టు పనులను చేపట్టాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పోలవరం ఆర్ అండ్ ఆర్, భూసేకరణ పురోగతిపై సీఎం ఆరా తీస్తూ.. వచ్చే ఏడాది మార్చి నాటికి ప్రాజెక్ట్ పనులన్నీ పూర్తి కావాలని, ఎక్కడా ఆర్థికపరమైన లేదా ఇతర ఇబ్బందులు రాకూడదని ఆర్థిక శాఖ ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. పోలవరం ప్రాజెక్టును పర్యాటకంగానూ అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి చెప్పారు. పోలవరం ఎడమ కాల్వ ద్వారా వచ్చే నీటితో వీలైనంత మేరకు అనకాపల్లి జిల్లాలోని రిజర్వాయర్లను పూర్తి స్థాయిలో నింపాలన్నారు. జల సంరక్షణనూ ప్రజా ఉద్యమంగా మలచాలన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం... వాటి వల్ల కలిగే ప్రయోజనాలు... నీటి ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు సామాజిక మాధ్యమాలను వినియోగించుకోవాలని సూచించారు. జలధార-జలహారతి వంటి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, భూగర్భ జలాల పెంపుతో కలిగే లాభాలను వివరించి ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఈ సమీక్షలో జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు, సీఎస్ సాయి ప్రసాద్, ఆర్థిక శాఖ, జలవనరుల శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నేటి ఉదయం నుంచి పింఛన్ల పంపిణీ

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో అక్టోబర్ నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ అక్టోబర్ 1వ తేదీ ఉదయం నుండి జరుగుతుందని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. అక్టోబర్ 1వ తేదీన పింఛను తీసుకోలేని వారికి అక్టోబర్ 3వ తేదీన అందజేస్తారని చెప్పారు. ఎస్.జీ.ఎస్.డబ్ల్యూ, ఇతర ప్రభుత్వ సిబ్బంది ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దనే పింఛన్లను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. బ్యాంకుల నుండి నగదు పొందడం, సిబ్బందిని మ్యాపింగ్ చేయడం, పంపిణీ సక్రమంగా, సాఫీగా జరుగుటకు సరైన పర్యవేక్షణ, కార్యాచరణ తయారు చేసి సిద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో 2,50,576 మందికి పింఛన్లు క్రింద 109.32 కోట్ల రూపాయలు పంపిణీ జరుగుతుందని చెప్పారు. పంపిణీ సమయంలో ఎటువంటి లోపాలు లేకుండా సిబ్బంది సంయమనంతో వ్యవహరించాలని చెప్పారు.

# వృద్ధులకు సర్కార్ వైద్యంతో భరోసా

(మొదటి పేజీ తరువాయి)

అక్టోబర్ 1న అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంత్రి ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. అక్టోబర్ నెలంతా వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు.

**పీ హెచ్‌సీ నుంచి జిల్లా ఆసుపత్రి వరకు :** 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లా ఆసుపత్రుల వరకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతి గురువారం పీహెచ్‌సీల్లో వృద్ధుల కోసం ప్రత్యేక వైద్య సేవలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అవసరమైన వారిని మెరుగైన వైద్యం కోసం తదుపరి స్థాయి ఆసుపత్రులకు పంపిస్తున్నామని తెలిపారు. జిల్లా ఆసుపత్రుల్లో ప్రత్యేక వృద్ధుల వార్డులు ఏర్పాటు చేసి, కదలికల్లో ఇబ్బందులు ఉన్న వారికి ఫిజియోథెరపీ, పునరావాస సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా ఆసుపత్రులు లేనిచోట ఏరియా ఆసుపత్రుల్లో ప్రత్యేక వృద్ధుల వార్డులు ఉన్నాయి.

**74 వృద్ధాశ్రమాల్లో సమగ్ర సర్వే :** వృద్ధులకు సమాజ స్థాయిలోనే మెరుగైన వైద్య సేవలు అందించడంలో భాగంగా రాష్ట్రంలో 74 ( ప్రభుత్వ గుర్తింపు పొందిన) వృద్ధాశ్రమాలను ప్రత్యేక వైద్య బృందాలు సందర్శించాయి. ఈ సందర్భంగా వృద్ధుల ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా అంచనా వేశాయి. . గత ఏడాది అక్టోబర్లో జరిగిన ఈ అంచనాల్లో వృద్ధుల్లో ప్రధానంగా కనిపిస్తున్న వివిధ ఆరోగ్య, మానసిక, రోజువారీ జీవన సమస్యలను గుర్తించాయి.

సర్వేలో 18.8% మందిలో కుంగుబాటు సమస్య, 9.8% మందిలో తరచూ పడిపోవడం, 7.5% మందిలో జ్ఞాపకశక్తికి సంబంధించిన సమస్యలు, 2.1% మందిలో జ్ఞాపకశక్తి సమస్యతో పాటు కుంగుబాటు, మిగిలినవారిలో జ్ఞాపకశక్తి సమస్య, కుంగుబాటు, తరచూ పడిపోవడం వంటి మూడు సమస్యలు కలిసి ఉన్నట్లు గుర్తించారు.

6.4% మందిలో ఒకటి కంటే ఎక్కువ వృద్ధాప్య సంబంధిత ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించారు.

లిమిగిలిన వారిలో వంట చేయడం, సరుకులు కొనడం, ప్రయాణించడం లేదా ఇంటి బయటకు వెళ్లడం, సాధారణ పనులను స్వయంగా నిర్వహించడం వంటి రోజువారీ అవసరమైన కార్యకలాపాల్లో ఇబ్బందులు ఉన్నట్లు గుర్తించారు.

లిసర్వేలో గుర్తించిన వారికి అవసరమైన కౌన్సెలింగ్, చికిత్స, ఇతర సహాయక సేవలు అందించారు. వృద్ధాశ్రమాల్లో నిర్వహించిన ప్రత్యేక సందర్శనల్లో మానసిక వైద్యులు, మానసిక ఆరోగ్య నిపుణులు కూడా పాల్గొని అవసరమైన సూచనలు, సహాయాన్ని అందించారు.

**గతేడాది వృద్ధులకు 1.10 కోట్ల ఆరోగ్య పరీక్షలు :** 2025-26లో రాష్ట్రవ్యాప్తంగా 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు 1,10,01,508 ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 6,12,601 ఫిజియోథెరపీ సేవలు ఉన్నాయి. 2026-27లో ఇప్పటివరకు 52,79,669 ఓపీ, ఐపీ ఫిజియోథెరపీ, ఇతర సేవలు వృద్ధులకు అందాయి

**అక్టోబర్‌లో ప్రతి జిల్లాలోని ప్రత్యేక కార్యక్రమాలు :** అక్టోబర్ 1న అన్ని జిల్లాల్లో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించి, వృద్ధులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఆరోగ్యకరమైన వృద్ధాప్యం, వ్యాధుల ముందస్తు గుర్తింపు, రక్తపోటు, మానసిక ఆరోగ్యం, ఫిజియోథెరపీ, పునరావాసం, వృద్ధుల ప్రత్యేక వైద్యం వంటి అంశాలపై



అక్టోబర్ నెలంతా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కాంప్రహెన్సు జిరియాట్రిక్ అసెస్మెంట్ టూల్ తో ప్రశ్నావళి ఆధారంగా జిల్లా, ఏరియా ఆసుపత్రిలో కనీసశీ 1000 నుంచి ఆరోగ్య వివరాలు సేకరిస్తారు. వీటికి అనుగుణంగా చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటారు.

# మైనారిటీల కోసం "రిఫార్మ్ ఉత్సవ్"

(మొదటి పేజీ తరువాయి)

(ఎన్ ఎం డి ఎఫ్ సి ) ఆధ్వర్యంలో అక్టోబర్ 8న మైనారిటీల కోసం "రిఫార్మ్ ఉత్సవ్"భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు మైనారిటీ,న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. తొలిసారిగా విజయవాడలో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక "రిఫార్మ్ ఉత్సవ్" నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు బుధవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి వెల్లడించారు. మైనారిటీ వర్గాల సామాజిక, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నతమైన ఉద్దేశ్యంతో సంక్షేమ పథకాలను, తక్కువ వడ్డీతో కూడిన రాయితీ రుణాలను అందిస్తున్నాయని తెలిపారు. అయితే ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సరైన సమాచారం లేకపోవడం, అవగాహన లేకపోవడం వల్ల చాలామంది ఈ అవకాశాలను అందుకోలేకపోతున్నారన్నారు. ఈ లోటును భర్తీ చేయడమే లక్ష్యంగా 'రిఫార్మ్ ఉత్సవ్' నిర్వహించడం



ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా మైనారిటీ మహిళల ఆర్థికాభివృద్ధికి, నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు, విద్యార్థుల ఉన్నత చదువులకు లభించే వివిధ ప్రభుత్వ రుణాలు, శిక్షణా కార్యక్రమాలపై ఎన్ ఎం డి ఎఫ్ సి తరఫున జాతీయ స్థాయి అధికారులు నేరుగా అవగాహన కల్పిస్తారని తెలిపారు. లబ్ధిదారులకు, ప్రభుత్వానికి మధ్య ఇదొక వారధిలా పనిచేస్తుందన్నారు. విజయవాడలో అంబేద్కర్ కళా వేదికలో జరగబోయే ఈ మెగా అవగాహన సదస్సుకు రాష్ట్రంలోని మైనారిటీ సోదర సోదరీమణులు, నిరుద్యోగ యువతీ యువకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, లబ్ధిదారులు అందరూ భారీ సంఖ్యలో తరలిరావాలని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సువర్ణావకాశాన్ని మైనారిటీలందరూ సద్వినియోగం చేసుకుని, ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. సదస్సును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని, హాజరయ్యే ప్రతినిధులకు,ప్రజలకు తగిన ఏర్పాట్లు చేయాలని మైనారిటీ సంక్షేమ కార్యదర్శిని మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులను మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆదేశించారు.

# రబీ పంటలకు ధర భరోసా

**అమరావతి, సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ ఫైల్):** 2027-28 మార్కెటింగ్ సీజన్‌కు రబీ పంటల కనీస మద్దతు ధరలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్వాగతించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో అన్ని నిర్దేశిత రబీ పంటల ఎంఎస్‌పీ పెంపునకు ఆమోదం తెలపడం రైతులకు మరింత ధర భరోసా కల్పించే నిర్ణయమని పేర్కొన్నారు. గోధుమకు క్వింటాల్‌కు రూ. 2,610, బార్లీకి రూ. 2,286, శనగకు రూ. 5,958, మసూర్ పప్పుకు రూ. 7,390, రేప్‌సీడ్ ఉ మస్టర్డ్/ఆవాలకు రూ. 6,613, కుసుమకు రూ. 7,215 కనీస మద్దతు ధరగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. గత సీజన్‌తో పోలిస్తే కుసుమకు క్వింటాల్‌కు రూ. 675, రేప్‌సీడ్ ఉ మస్టర్డ్‌కు రూ. 413, మసూర్ పప్పుకు రూ. 390, బార్లీకి రూ. 136, శనగకు రూ. 83, గోధుమకు రూ. 25




చొప్పున ఎంఎస్‌పీ పెంచినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా పప్పుధాన్యాలు, నూనెగింజలకు అధిక మద్దతు ధర కల్పించడం ద్వారా రైతులను పంటల వైవిధ్యీకరణ వైపు ప్రోత్సహించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. రైతు పండించిన ప్రతి పంటకు పెట్టుబడికి తగిన ప్రతిఫలం, గిట్టుబాటు ధర అందాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్దేశమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రైతుల ఆదాయం పెంపు, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం, మార్కెట్లో ధరల ఒడిదుడుకుల నుంచి రైతులను రక్షించడం వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యం అవసరమన్నారు. రాష్ట్రంలోనూ రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఇతర వ్యవసాయ ఇన్‌పుట్లు సకాలంలో అందుబాటులో ఉంచడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో మార్కెట్ జోక్యం ద్వారా రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. అన్నదాతకు ఆర్థిక భరోసా కల్పిస్తూ వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# రూ.లక్ష కోట్లతో హార్టీకల్చర్ హబ్ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

అయిదేళ్ల వైసీపీ పాలనలో పులివెందుల వాసులను, రాష్ట్ర ప్రజలను జగన్ నమ్మించి మోసం చేస్తే... కూటమి ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తోందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పులివెందుల మున్సిపాల్టీలో కూటమి విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. రూ.లక్ష కోట్లతో రాయలసీమలో హార్టీకల్చర్ హబ్ ఏర్పాటును హర్షిస్తూ...బుధవారం పులివెందులలో జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత నేతృత్వంలో భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయం నుంచి నాలుగు కిలోమీటర్ల మేర సాగిన ఈ ర్యాలీలో మంత్రి సవిత స్వయంగా ట్రాక్టర్ నడిపి కూటమి నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో పులివెందుల నియోజక వర్గ టీడీపీ ఇన్చార్జి బీటెక్ రవి, ఇతర కూటమి నాయకులతో కలిసి మంత్రి సవిత మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి రాయలసీమ అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. ఒకవైపు సాగునీటి ప్రాజెక్టుల పనులు కొనసాగిస్తూనే...మరో వైపు పెద్ద ఎత్తున పరిశ్రమలను నెలకొల్పొతున్నారన్నారు. దీనిలో భాగంగా రూ. లక్ష కోట్లతో రాయసీమలో హార్టీకల్చర్ హబ్ ను ఏర్పాటు చేయనున్నారన్నారు. ఈ హార్టీకల్చర్ హబ్ తో రాయలసీమతో పాటు ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాలు కూడా లబ్ధి పొందుతుందన్నారు. హార్టీకల్చర్ హబ్ తో దేశంలోనే ఉద్యానవన సాగులో రాయలసీమ నెంబర్ వన్ గా నిలవనుందన్నారు.

**అక్టోబర్ 2న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా :** రూ. లక్ష కోట్లతో చేపడుతున్న రాయలసీమ హార్టీ




కల్చర్ హబ్ ను వచ్చే నెల రెండో తేదీన గాంధీ జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. రూ. లక్ష కోట్లలో రూ. 30 వేల కోట్లు ప్రపంచ బ్యాంకు నిధులు, రూ. 10 వేల కోట్లు కేంద్రం, మిగిలిన రూ. 60 వేల కోట్లు ప్రైవేటు నిధులు వెచ్చిస్తున్నాయన్నారు. హార్టకల్చర్ హబ్ ఏర్పాటుతో రాయలసీమ రూపురేఖలు మారనున్నాయన్ని మంత్రి సవిత ఆనందం వెలిబుచ్చారు.

**జగన్ మాట తప్పితే... చంద్రబాబు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నారు :** కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నామని మంత్రి సవిత తెలిపారు. సూపర్ సిక్స్ పథకాల అమలుతో పాటు రోడ్లు, కాలువలు, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమల ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా, రైజింగ్ రాయలసీమే లక్ష్యంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు పరిశ్రమలను విస్తృతంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో జగన్ చేసిందేమీ లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సైతం నెరవేర్చలేకపోయారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పాలన సాగిస్తోందని మంత్రి సవిత తెలిపారు. అంతకుముందు రాయలసీమలో రూ. లక్ష కోట్లతో హార్టీకల్చర్ హబ్ ఏర్పాటును హర్షిస్తూ భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. పులివెందులలోని టీడీపీ కార్యాలయం నుంచి మినీ కార్యాలయం వరకూ నాలుగు కిలో మీటర్ల మేర ఈ ర్యాలీకి జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ జెండా ఊపి ప్రారంభించారు. మంత్రి సవిత కార్యక్రమం ఆద్యంతం ట్రాక్టర్ నడిపి కూటమి నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. జై చంద్రబాబు, జై కూటమి నినాదాలతో పులివెందుల పట్టణం హోరెత్తిపోయింది. ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీలో పెట్టుబడుల ప్రవాహానికి ముంబై రోడ్‌షో




- పారిశ్రామికవేత్తలకు రాష్ట్రంలోని అవకాశాలపై అవగాహన
- 3ఎస్ విధానంతో పెట్టుబడులకు ప్రోత్సాహం
- నవంబరు 12, 13న విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**అమరావతి, సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అపారమైన పెట్టుబడి అవకాశాలను పారిశ్రామిక వేత్తలకు వివరించేందుకు, నూతన భాగస్వామ్యాలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, భారత పరిశ్రమల సమాఖ్య సంయుక్తంగా ముంబైలో బుధవారం భారీ 'ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ రోడ్‌షో' నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ రోడ్‌షోలో ప్రముఖ పారిశ్రామిక సంఘాలు, వాణిజ్య సంస్థలు, విదేశీ వాణిజ్య ప్రతినిధులు, వ్యాపారవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలకు కావలసిన భూమి, సహజ వనరులు, మెరుగైన మౌలిక సదుపాయాలు, ఓడరేవులు, లాజిస్టిక్స్ నెట్‌వర్క్ అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన విధానాలను అమలు చేస్తూ, పెట్టుబడులను సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందన్నారు. ఈ రోడ్‌షోలో ప్రధానంగా బీఎఫ్ఎస్ఐ & ఫిన్‌టెక్, జౌళి-వస్త్ర రంగం, ఫార్మాస్యూటికల్స్ ఉ లైఫ్ సైన్సెస్, కెమికల్స్ ఉ పెట్రోకెమికల్స్, పోర్టులు ఉ షిప్పింగ్ లాజిస్టిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ & ఎఫ్ఎమ్‌సిజి, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన రంగాలలో ఉన్న విస్తృత అవకాశాలను ప్రత్యేకంగా వివరించారు. ఇక ప్రభుత్వం 3ఎ కాన్సెప్ట్ ( స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, సర్వీస్, స్టెబులిటీ ) విధానంతో పని చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.

**విశాఖ సదస్సుకు సన్నాహాలు:** రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర వ్యూహంలో భాగంగా ఈ రోడ్‌షో నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. ఈ రోడ్ షో నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న 'సీఐఐ భాగస్వామ్య సదస్సు'కు ఆరంభ వేదికగా నిలిచిందన్నారు. ఈ రోడ్‌షో ద్వారా మహారాష్ట్రకు చెందిన ప్రముఖ కంపెనీలు రాబోయే విశాఖ సదస్సులో పాల్గొని, ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు గల అవకాశాలు మరింత విస్తృతమైనట్లు మంత్రి తెలిపారు.

## శబరిమలై భక్తుల సమస్యలు తీర్చాలి

(మొదటి పేజీ తరువాయి)

శబరిమలై యాత్ర సందర్భంగా ఏపీ నుంచి వెళ్లే అయ్యప్ప భక్తులకు అవసరమైన సౌకర్యాలు, రవాణా, దర్శనం తదితర అంశాల్లో తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఏపీ నుంచి ప్రతి ఏడాది పెద్ద సంఖ్యలో భక్తులు శబరిమలైకు వెళ్తున్న నేపథ్యంలో వారి ప్రయాణం సౌకర్యవంతంగా, సురక్షితంగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని పీవీఎన్ మాధవ్ విజ్ఞప్తి చేశారు. భక్తుల సమస్యలను సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పరిష్కరించేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు.

శబరిమలై యాత్రకు వెళ్లే భక్తులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరినట్లు పీవీఎన్ మాధవ్ తెలిపారు.

## రాష్ట్రంలో ఏడుగురు ఐఎఫ్ఎస్ అధికారుల బదిలీ

- వివిధ జిల్లాలకు కొత్త పోస్టింగులు.. ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ సాయిప్రసాద్

**అమరావతి, సెప్టెంబరు 30:** రాష్ట్రంలో ఏడుగురు ఐఎఫ్ఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. సబ్-డీఎఫ్ఓలుగా పనిచేస్తున్న పలువురు అధికారులకు డీఎఫ్ఓలుగా, ఇతర కీలక బాధ్యతల్లో కొత్త పోస్టింగులు కల్పించారు. లక్కవరం సబ్-డీఎఫ్ఓగా పనిచేస్తున్న 2022 బ్యాచ్ అధికారి శివకుమార్ గంగాల్‌ను రంపచోడవరం డీఎఫ్ఓగా బదిలీ చేశారు. ప్రొద్దుటూరు సబ్-డీఎఫ్ఓగా పనిచేస్తున్న 2023 బ్యాచ్ అధికారి గరుడ్ సంకేత్ సునీల్‌కు చింతూరు డీఎఫ్ఓగా పోస్టింగ్ ఇచ్చారు. వెంకటగిరి సబ్-డీఎఫ్ఓగా ఉన్న 2023 బ్యాచ్ అధికారి కె. వెంకట శ్రీకాంత్‌ను ఆత్మకూరు ప్రాజెక్టు టైగర్ డిప్యూటీ డైరెక్టర్‌గా నియమించారు.

గిద్దలూరు సబ్-డీఎఫ్ఓగా ఉన్న 2023 బ్యాచ్ అధికారి కె. బాలరాజును కడప డీఎఫ్ఓగా బదిలీ చేశారు. దోర్నాల సబ్-డీఎఫ్ఓగా విధులు నిర్వహిస్తున్న 2023 బ్యాచ్ అధికారి నీరజ్ హాన్స్‌కు పార్వతీపురం మన్యం జిల్లా డీఎఫ్ఓగా పోస్టింగ్ కల్పించారు. శ్రీశైలం సబ్-డీఎఫ్ఓగా ఉన్న 2023 బ్యాచ్ అధికారిణి బబితా కుమారిని విజయనగరం డీఎఫ్ఓగా నియమించారు.

# ఉప సర్పంచ్‌ల జాయింట్ చెక్ పవర్ కొనసాగించాలి

- శిలాఫలకాలపై సర్పంచ్‌లతో సమానంగా ఉప సర్పంచ్‌ల పేర్లు ఉండాలి
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉప సర్పంచ్‌ల కార్యవర్గ సమావేశంలో డిమాండ్



**మహేశ్వరం, సెప్టెంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉప సర్పంచ్‌ల కార్యవర్గ సమావేశం మహేశ్వరం మండల పరిధిలోని గ్రాండ్ ఏరినా స్పోర్ట్స్ కౌంటీ రిసార్ట్స్‌లో నిర్వహించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఉపసర్పంచ్‌లు పెద్దసంఖ్యలో సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బోట్ల కార్తీక్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో అన్ని గ్రామాల ఉప సర్పంచ్‌లకు సర్పంచ్‌లతో పాటు జాయింట్ చెక్ పవర్‌ను యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలపై సర్పంచ్‌లతో సమానంగా ఉప సర్పంచ్‌ల పేర్లను కూడా అధికారికంగా ఏర్పాటు చేయాలని కోరారు. మండల స్థాయిలో నిర్వహించే జనరల్ బాడీ సమావేశాల్లో ఉపసర్పంచ్‌లకు కూడా అవకాశం కల్పించాలని అన్నారు. రంగారెడ్డి జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు అంగోత్ భాస్కర్ నాయక్ మాట్లాడుతూ ఉప సర్పంచ్‌ల జాయింట్ చెక్ పవర్ తొలగిస్తారనే వదంతుల నేపథ్యంలో ఇందిరా పార్క్ వద్ద ఉప సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి ప్రభుత్వానికి తమ అభిప్రాయాలను తెలియజేశామని అన్నారు. అనంతరం రాష్ట్ర కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఉప సర్పంచ్‌లకు కల్పించిన హక్కులను కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా మని చెప్పారు. గ్రామ పంచాయతీ నిధుల వినియోగం, తీర్మానాల విషయంలో ఉప సర్పంచ్‌లకు కూడా సమాన భాగస్వామ్యం కల్పించాలని భాస్కర్ నాయక్ డిమాండ్ చేశారు. సర్పంచ్, కార్యదర్శులు మాత్రమే నిర్ణయాలు తీసుకునే విధానం కాకుండా, ఉప సర్పంచ్‌ల సంతకాలు కూడా తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే సర్పంచ్‌లతో పాటు ఉప సర్పంచ్‌లకు కూడా గౌరవ వేతనం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్ట శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు శివకుమార్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మరి నరేష్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు డి. బాల్‌రాజు, రోహిత్ కుమార్, ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌గౌడ్, షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అభినవ్, మహేశ్వరం మండల అధ్యక్షుడు దయాకర్ రెడ్డితో పాటు వివిధ గ్రామాలు, మండలాలకు చెందిన ఉప సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

## ఇక ఆర్మీ ఇంజినీరింగ్ అధికారుల సేవలు వినియోగం

**హైదరాబాద్, సెప్టెంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** ఇక ఆర్మీ ఇంజినీరింగ్ అధికారుల సేవలను తెలంగాణ ప్రభుత్వం వినియోగించుకోబోతోంది.. శ్రీశైలం ఎడమ గట్టు కాలువ, కాళేశ్వరం ప్రాజెక్ట్ పనులకు వీరి సేవలను ఉపయోగించు కోవాలని నిర్ణయం తీసుకుంది.. ఇందుకోసం ఆర్మీలోని ఇంజినీరింగ్ అధికారుల సహాయాన్ని సర్కార్ కోరింది. దీనిపై స్పందించిన ఆర్మీ ప్రధాన కార్యాలయం.. ముగ్గురు ఆర్మీ అధికారుల పేర్లు రాష్ట్రానికి పంపించింది. డిప్యుటేషన్‌పై ముగ్గురు అధికారులను తీసుకునే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఎసఎల్‌బీసీ టన్నెల్ పర్యవేక్షణకు ఒక ఆర్మీ అధికారి, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లకు ఇద్దరు ఆర్మీ అధికారులను తీసుకోనున్నారు. ఇటీవల ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్‌తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయిన విషయం తెలిసిందే. ఎసఎల్‌బీసీ సాంకేతిక సవాళ్లపై ఆర్మీ చీఫ్‌తో చర్చించారు. కల్నల్ పరీక్షిత్ మెహ్రా సేవలతో సానుకూల ఫలితాలు వస్తున్నాయని మంత్రి అన్నారు. ఈ సమావేశం అనంతరం ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ స్పందించి.. ముగ్గురు ఆర్మీ అధికారుల పేర్లను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించింది. మరోవైపు.. 44 కిలోమీటర్ల ఎసఎల్‌బీసీ టన్నెల్‌లో 35 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను 2028 జూన్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కాళేశ్వరం మూడు బ్యారేజీల పునరుద్ధరణకు శాస్త్రీయ పరీక్షలు నిర్వహించారు. మట్టి, కాంక్రీట్, పునాదుల పరీక్షలు తుది దశకు చేరాయి. ఐఐటీ బాంబే, ఏఎఫఆర్‌వై ఇండియా ఆధ్వర్యంలో ఫలితాల విశ్లేషణ జరుగుతోంది. భద్రత, నాణ్యత విషయంలో రాజీ ఉండదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## బంజరుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు షూస్ పంపిణీ

**ములుగు, సెప్టెంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** బంజరుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న షూస్ పంపిణీ కార్యక్రమం ప్రధానోపాధ్యాయురాలు మర్రిపల్లి శ్రీలత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కంచం రఘు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి ,ప్రైవేట్ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థుల మాదిరిగా విద్యార్థులకు షూస్ అందించడం గొప్ప విషయమని అభినందనీయమని ,ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మర్రిపల్లి శ్రీలత గారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా ప్రతి ఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఉప సర్పంచ్ దాసరి గంగయ్య గారు, ఉపాధ్యాయులు అరుణ్ కుమార్, యూత్ అధ్యక్షుడు గంగుల రాజు ,తల్లిదండ్రులు ఎర్రం సమ్మయ్య ,దర్శనాల సత్యం, రేగుల సది తదితరులు హాజరై విద్యార్థులకు షూస్ పంపిణీ చేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

## మంగపేట రోడ్లపై పార్కింగ్ ఇబ్బందులు

**ఏటూరునాగారం, సెప్టెంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలో ఇటీవల జరిగిన రోడ్డు వైడనింగ్ తర్వాత రవాన వాహనాలను యజమానులు రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండడంతో ఆర్టీసీ బస్సులు పాత బస్టాండ్ వరకు రాలేక పోతున్నాయని గ్రామ పంచాయతీ కార్యదర్శి బోట సురేష్ తెలిపారు. డ్రైనేజీ పనులకు ప్రజలు సహకరించకపోవడంతో పాటు ఇరువైపులా లారీలు, కార్లు, బైక్లు నిలపడం, వైర్లు అడ్డంగా ఉండడంతోనే బస్సులను గంపోనిగూడెం క్రాస్ వరకే ఆపుతున్నామని ఆర్టీసీ వరంగల్-2 డీఎం తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. ఆటోలు కూడా రహదారిలో నీలపకుశీడా, ప్రజలు రోడ్డు పై వాహనాలు నిలపకుండా ట్రాఫిక్ క్లియరెన్సుకు సహకరించాలని, ఆర్టీసి బస్లను బస్ స్టేషన్ వరకు వస్తున్నాయనీ అయితే ఇకపై నిబంధనలు ఉల్లంఘిస్తే నోటీసులు ఇచ్చి కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.



### ఇస్కాసురుల దోపిడీ..!

## పట్టించుకోని, అధికార యంత్రాంగం

**కోహెడ, సెప్టెంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** కోహెడ మండల పరిధిలోని, గ్రామాలలో.. ప్రవహించే మోయతుమ్మెద వాగు, అక్రమాలకు అడ్డుకట్టగా దర్శనం ఇస్తోంది. ఈ "ఇస్కాసురుల దోపిడీ" ముసుగులో పలువురు, తమ పలుకుబడిని ఉపయోగించుకుని ఇష్టానుసారంగా.. ఇసుకను తవ్వి తరలిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి అనుమతులు పొందకుండానే.. మోయతుమ్మెద వాగు నుండి ప్రతి రోజూ ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలించి, కొన్ని చోట్ల ఇసుక డంపులుగా నిల్వ చేసుకుంటున్నా.. అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై, పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇసుక ఇష్టానుసారంగా తీస్తుండటంతో.. మోయతుమ్మెద వాగు వాస్తవానికి, అక్రమ ఇసుక వ్యాపార ముఠాలకు ఒక ప్రధాన కేంద్రంగా మారిపోయింది. ఈ అక్రమ ఇసుక రవాణాను, అరికట్టడంలో.. అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు.

## లక్ష్మీ భాస్కర్ బ్రోకర్ దందాలు..!

- ఒకటొకటిగా బయటకు..!
- నిమ్స్‌లో కాంట్రాక్టులు..
- డబ్బులు తీసుకుని తాత్కాలిక ఉద్యోగాలు..
- అన్ని బొక్కలు లెక్కలు బయటికి వస్తున్నాయి..!



**హైదరాబాద్, సెప్టెంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** హైదరాబాద్‌లోని నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్/అదనపు ప్రొఫెసర్ అయిన శ్రీ నోరి లక్ష్మీ భాస్కర్‌పై నమోదు చేసిన ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల సోదాల కొనసాగింపు. గతంలో, హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు చెందిన అదనపు మెడికల్ సూపరింటెండెంట్/అదనపు ప్రొఫెసర్ అయిన నోరి లక్ష్మీ భాస్కర్‌పై, సెక్షన్ 13(1)(బి), 13(2) కింద, Cr.No.6/RCA-CIU-ACB/ 2026, తేది 21.09.2026 నంబరులో ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేయబడింది. గతంలో జరిపిన సోదాలకు కొనసాగింపుగా, హైదరాబాద్, ఎస్పీఈ - ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి జారీ చేసిన సెర్చ్ వారెంట్ల మేరకు, నిందితుడైన అధికారితో ఆర్థిక, ఇతర లావాదేవీలు కలిగి ఉన్నారని ఆరోపించబడిన అనుమానిత బినామీల నివాసాలతో సహా, హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల్లోని (5) వేర్వేరు ప్రదేశాలలో ఈ రోజు, అనగా 29.09.2026న సోదాలు నిర్వహించబడ్డాయి. సోదాల సమయంలో, అనుమానిత బినామీల నివాసాల నుండి, వారి బినామీ ఆస్తులకు సంబంధించిన సాక్ష్యాధారాలలో భాగంగా ఉన్న అనేక పత్రాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిమ్స్ ఉద్యోగి అయిన ధనరాజ్ ఇంట్లో రూ. 4,94,394/- నగదును స్వాధీనం చేసుకోగా, నిమ్స్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అయిన డి. గణేష్, ఇతరుల పేర్ల మీద మహేశ్వరంలోని సుమారు 57 లక్షల విలువైన 3 వ్యవసాయ భూములు, బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే కాలనీలో గల వెంకటేశ్వర కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో రూ. 2,70,00,000/- విలువైన ఒక ఓపెన్ ప్లాట్, రూ. 20,00,000/- విలువైన రెండు పెట్టుబడులకు సంబంధించిన అనేక పత్రాలు లభించాయి. ఇంకా, రూ. 3,00,000/- చేతి అప్పు రసీదులు కూడా దొరికాయి. అదనపు ఆస్తుల తదుపరి ధృవీకరణ జరుగుతోంది. కేసు దర్యాప్తులో ఉంది.

## ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి

- పూడూరు సొసైటీ చైర్మన్ ఎన్ సుధాకర్ రెడ్డి



**మేడ్చల్, సెప్టెంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని పూడూరు సొసైటీ చైర్మన్ ఎన్.సుధాకర్ అన్నారు. మంగళవారం మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామంలో ఉన్న రైతు వ్యవసాయ సహకార సంఘం 49వ సర్వసభ్య సమావేశం సొసైటీ చైర్మన్ ఎన్.సుధాకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సొసైటీ డైరెక్టర్లు, సొసైటీ ఎండీ సాయి దత్త చైతన్య,ఎస్బీఐ బ్యాంక్ మేనేజర్ రవి శంకర్,సొసైటీ పరిధిలోని పలువురు రైతులు హాజరయ్యారు. ఈసందర్భంగా సొసైటీ చైర్మన్ ఎన్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ సొసైటీ నుండి రుణాలు తీసుకున్న రైతులందరూ సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తమ సొసైటీ పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన తర్వాత తీర్మానంచేసివన్‌టైం సెటిల్మెంట్‌కు అవకాశం ఇవ్వగా రూ.2కోట్ల వరకు రుణాలు వసూలు అయినట్లుగా తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ వల్ల ఎరువుల కొనుగోలు విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే ప్రభుత్వం దీన్ని తీసేయాలని కోరారు. అలాగే రాష్ట్రంలోని రైతు సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. నా నామినేటెడ్ పద్ధతిలో కాకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో రైతు వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ శ్యామ్ లాల్,డైరెక్టర్లు స్వరూప,మలోత్ రవి, విఠల్ రెడ్డి, వీరేందర్ గౌడ్,చిన్న మల్లేష్, మామిండ్ల శ్రీశైలం,డి విజయ్ కుమార్,అర్జున్, బి.శ్రీనివాస్ గౌడ్,తునికి సత్తెమ్మ,రైతులు పాల్గొన్నారు.

## నల్లగండ్ల హుడా కాలనీలో చైన్ స్నాచింగ్

**శేర్లింగంపల్లి, సెప్టెంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నల్లగండ్ల హుడా కాలనీలో మంగళవారం ఉదయం చైన్ స్నాచింగ్ ఘటన చోటుచేసుకుంది. ఉదయం సుమారు 7.40 గంటల సమయంలో 63 ఏళ్ల ఉమాదేవి అపార్ట్‌మెంట్ ఎదుట సీసీ రోడ్డుపై వాకింగ్ చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి మోటార్‌సైకిల్‌పై వచ్చి ఆమె మెడలోని సుమారు 5.5 తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తూ, సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. నిందితుడిని గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సూచన: కాలనీవాసులు ఇళ్ల ముందు, ఎడమ-కుడి వైపుల రహదారులను కవర్ చేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు. అలాగే ప్రతి కాలనీ చౌరస్తాలో నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నేరాల దర్యాప్తులో ఫుటేజీ ఉపయోగపడుతుందని, నిందితులను త్వరగా గుర్తించేందుకు దోహదపడుతుందని తెలిపారు.

## ప్రీ ప్రైమరీ టీచర్ల కు కాంప్లెక్స్ సమావేశాలు ప్రారంభం



**మణికొండ, సెప్టెంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** మణికొండ ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయుల మొదటి కాంప్లెక్స్ సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాల్లో భాగంగా జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్ డాన్ ఆర్నాల్డ్ ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. పూర్వ ప్రాథమిక విద్యను బోధించడంలో అనుసరించాల్సిన మెళకువలు, చిన్నారులకు సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధించే పద్ధతులు, పిల్లల్లో అభ్యసన ఆసక్తిని పెంపొందించే విధానాలపై ఆయనఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమానికి స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దశరథ్ నాయక్ హాజరై, చేవెళ్ల, మొయినాబాద్, గండిపేట, రాజేంద్రనగర్ మండలాల పరిధిలోనిపాఠశాలల్లో పనిచేస్తున్నఉపాధ్యాయులకుఆతిథ్యం అందించారు.

## యువకులపై దాడి కేసులో ఐదుగురు అరెస్ట్

### చీర్యాల గణేష్ పండల్ వద్ద ఘర్షణ

**కీసర, సెప్టెంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** చీర్యాల గ్రామంలోని గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన గణేష్ పండల్ వద్ద జరిగిన ఘర్షణ, దాడి కేసులో ఐదుగురు నిందితులను కీసర పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. గణేష్ నిమజ్జనం సందర్భంగా యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను ఆహ్వానించే విషయంలో వివాదం ఏర్పడింది. అనంతరం సెప్టెంబర్ 27న తెల్లవారుజామున గణేష్ పండల్ వద్ద ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో శివలింగాల మణీష్ గౌడ్‌తో పాటు మరో నలుగురు యువకులు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా అమీర్‌పేట ప్రసాద్ అలియాస్ చిచ్చు, రవణకొల తరుణ్ గౌడ్, కస్తూరి సత్యసాయి చంద్ర, యాకరి మురళీకృష్ణ అలియాస్ నాను, శాకమూరి హరీష్‌లను గుర్తించి సెప్టెంబర్ 29న కీసర ఎక్స్ రోడ్స్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం వారిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచనున్నట్లు తెలిపారు. మల్కాజిగిరి డీసీపీ ఆదేశాల మేరకు జవహర్‌నగర్ ఏసీపీ ఎస్.చక్రపాణి మార్గదర్శకత్వంలో కీసర ఇన్‌స్పెక్టర్ టిక్కి రమేశ్, ఎస్ఐ బి.నాగరాజు, సిబ్బంది కేసు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. పండుగలు, ఉత్సవాల సమయంలో శాంతియుతంగా వ్యవహరించాలని, వివాదాలు తలెత్తితే చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## తుకారాంగేట్ సుభాష్ విగ్రహం వద్ద సీపీఐ నిరసన

- జ్ఞానేశ్ కుమార్ ఓట్ల దొంగతనానికి పాల్పడ్డాడు
- జ్ఞానేశ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి: సీపీఐ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ డిమాండ్



**అడ్డగుట్ట, సెప్టెంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ తుకారం గేట్ సుభాష్ విగ్రహం ఎదుట ప్లకార్డులు పట్టుకొని నేతలు నిరసన తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్ వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని ప్రజల హక్కులను కాపాడాల్సిన ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ బిజెపికి అనుబంధ సంఘంగా వ్యవహరిస్తూ సర్ పేరుతో అక్రమంగా కోట్లాదిమంది ప్రజలను ఓట్లను తొలగిస్తూ ప్రజాస్వామ్యానికి ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగ వ్యతిరేకి అయిన జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే అరెస్టు చేసి సర్ ప్రక్రియను నిలిపివేయాలని సర్ పేరుతో అక్రమంగా తొలగించిన ఓట్లను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ బిజెపి అడుగులకు మడుగులొత్తుతున్న జ్ఞానేశ్ కుమార్ పైన సుప్రీం కోర్ట్ సుమోటోగా కేసు నమోదు చేసి జైలుకు పంపేలా జోక్యం చేసుకోవాలని కోరారు.. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కొమురెల్లి బాబు, పాకాల యాదగిరి, గౌరీ నాగరాజ్, సయ్యద్ గౌస్, రషీద్ యాదగిరి, సింగారయ్య, నరసింహ, అనిల్, పి,యాదగిరి, భీమేష్, తదితరులు పాల్గొన్నారు.

## రెండో దశ సర్‌లో ఫార్మ్ 6 పంపిణీ

- సర్‌ను విజయవంతం చేయాలి:డీసీసీ కార్యదర్శి ర్యాల రాజేందర్ యాదవ్



**అడ్డగుట్ట, సెప్టెంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సికింద్రాబాద్‌జిల్లాకాంగ్రెస్‌కమిటీజనరల్ సెక్రటరీ ర్యాలరాజేందర్ యాదవ్ పిలుపునిచ్చారు. రెండో దశ సర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మెట్టుగూడ కాంగ్రెస్ పార్టీ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి ఓటర్లు కి ఫార్మ్ 6 పంపిన చేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ నాయకులు టెంపుల్ శ్రీను, శ్రీను, మహిళా నాయకురాలు రూత్ క్లారి,కస్తూరి, సంతోషి పాల్గొన్నారు.

# తెలంగాణకు వెయ్యి చీకటి రోజులు..



- రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ తీవ్ర ఆగ్రహం..
- వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ పాలన మోసాలు, వైఫల్యాలమయం..
- అలీబాబా - 40 దొంగల కథలా రేవంత్ సర్కార్ తీరు..
- బీఆర్ఎస్ అధికార ప్రతినిధి రహీం ఉల్లా ఖాన్ నియాజీ ధ్వజం..
- వక్ఫ్ ఆస్తులు, మైనారిటీల సంక్షేమంపై తీవ్ర ఆందోళన వ్యక్తం..

**హైదరాబాద్, సెప్టెంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను విజయోత్సవంగా జరుపుకోవడంపై బీఆర్ఎస్ సీనియర్ నేత, పార్టీ అధికార ప్రతినిధి, తెలంగాణ ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ రహీం ఉల్లా ఖాన్ నియాజీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్‌కు ఇవి విజయోత్సవాలు కావచ్చని, కానీ రాష్ట్ర ప్రజలకు మాత్రం ఇవి నిరాశ, మోసం, వెనుకబాటుతనాన్ని మిగిల్చిన వెయ్యి చీకటి రోజులు అని ఆయన ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ అభివృద్ధి వందేళ్లు వెనక్కి వెళ్లిందని తీవ్రంగా విమర్శించారు.

**అలీబాబా - 40 దొంగల పాలన :**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, వందలాది హామీలు ప్రజలను వంచించేందుకేనని నియాజీ ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా హామీల అమలులో విఫలమై, ప్రజలను దగా చేస్తోందని మండిపడ్డారు. "రేవంత్ రెడ్డి ప్రభుత్వం అలీబాబా - 40 దొంగల కథలా తయారైంది. రేవంత్ రెడ్డి అలీబాబా అయితే, ఆయన క్యాబినెట్ - 40 మంది దొంగల మాదిరిగా వ్యవహరిస్తోంది" అని ఆయన తీవ్రంగా విమర్శించారు.

**పింఛన్లు, దరఖాస్తుల పేరుతో పేదల దోపిడీ :**

వృద్ధులు, వితంతువులు, నిరుద్యోగులకు పింఛన్లు, నిరుద్యోగ భృతి ఇస్తామంటూ కాంగ్రెస్ పార్టీ నమ్మబలికిందని నియాజీ గుర్తుచేశారు. వేలాది మంది పేదలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి ఫారాలు నింపితే, ఒక్కొక్కరూ దరఖాస్తుల కోసం రూ.500 నుండి రూ.1,200 వరకు ఖర్చు చేశారని తెలిపారు. నేటికీ చాలా మందికి మంజూరు రాకపోగా, పేద ప్రజల ఆశలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**వక్ఫ్ ఆస్తులు, మతపరమైన స్థలాలపై కూల్చివేతలు :**

రేవంత్ రెడ్డి హయాంలో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ గాలికి కొట్టుకుపోయిందని, ముస్లింలలో తీవ్ర ఆందోళన నెలకొందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మహేశ్వరం, జహంగీర్‌పీర్ ప్రాంతాల్లో వందల ఏళ్ల చరిత్ర కలిగిన మసీదులను రాత్రికి రాత్రే బుల్డోజర్లతో కూల్చివేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సీఎం సొంత నియోజకవర్గమైన కొడంగల్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా కబ్రస్తాన్‌లు, ఆశూర్‌ఖానాలు, దర్గాల వంటి మతపరమైన స్థలాలపై బుల్డోజర్లతో దాడులు చేయడం దారుణమన్నారు. ఆక్రమణలకు గురవుతున్న వక్ఫ్ భూములను ప్రభుత్వం తక్షణమే కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

**మైనారిటీలకు ఘోర అవమానం..:**

ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండేళ్ల పాటు క్యాబినెట్‌లో ముస్లిం మంత్రికి ప్రాతినిధ్యం కల్పించకపోవడం సిగ్గుచేటని, జూబ్లీహిల్స్ ఎన్నికల కోసమే అజారుద్దీన్‌కు పదవి ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. మైనారిటీ సంక్షేమ శాఖకు రూ.4,000 కోట్లు ఇస్తామన్న సీఎం, ఇప్పటివరకు కేవలం రూ.1,600 కోట్లే ఇచ్చి మోసం చేశారన్నారు. ఇక ఉర్దూ అకాడమీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్, మైనారిటీ కమిషన్లలో పనిచేస్తున్న ఉద్యోగులకు 4 నుండి 6 నెలలుగా జీతాలు అందక దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సహాయంతో పాటు 'తులం బంగారం' ఇస్తామని చెప్పి హామీని ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు.

కేసీఆర్ హయాంలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో హైదరాబాద్‌లో రాత్రి సమయాల్లోనూ మహిళలు నిర్భయంగా తిరిగేలా పటిష్టమైన శాంతిభద్రతలు ఉండేవని నియాజీ గుర్తుచేశారు. కానీ నేడు కిషన్‌బాగ్, కూకట్‌పల్లి, బార్కస్, బహదూర్‌పురా, అత్తాపూర్ వంటి ప్రాంతాల్లో వరుస హత్యలు, నేరాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఇంత కాలమైనా పూర్తి స్థాయి హోం మంత్రి లేకపోవడం ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. తెలంగాణ సాధన కోసం కేసీఆర్ 14 ఏళ్లు పోరాడి, హిందూ, ముస్లిం, సిక్కు, క్రైస్తవులను కడుపులో పెట్టుకుని లౌకిక రాజ్యంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దారని నియాజీ కొనియాడారు. రైతుబంధు, ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని తెలిపారు. మైనారిటీ విద్యార్థుల కోసం దేశంలోనే ఎక్కడా లేని విధంగా గురు కులాలను ఏర్పాటు చేసి, ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ద్వారా రూ.20 లక్షల వరకు ఆర్థిక సాయం అందించిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథతో పాటు హైదరాబాద్‌లో మెట్రో, ఫ్లైఓవర్లు, శాంతి భద్రతల పరిరక్షణ కేసీఆర్ హయాంలోనే అద్భుతంగా జరిగా యని గుర్తుచేశారు. గాంధీ భవన్ ప్రజల సమస్యలను పరిష్కరించే కేంద్రంగా కాకుండా, మోసాలు చేసే కేంద్రంగా మారిందని, కానీ బీఆర్ఎస్ తెలంగాణ భవన్ మాత్రం ప్రజా దర్బార్‌లతో నిరంతరం ప్రజలకు అండగా నిలుస్తోందని చెప్పారు. రాష్ట్రంలో గంగా - జమునీ తహజీబ్, లౌకికవాదం, హిందూ - ముస్లిం ఐక్యత మళ్లీ పరిఢవి ల్లాలంటే కేసీఆర్ నాయకత్వం అత్యంత అవసరమని పిలుపు నిచ్చారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని, బీఆర్ ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చి కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమని రహీం ఉల్లా ఖాన్ నియాజీ ధీమా వ్యక్తం చేశారు.

# పేదలకు శాశ్వత భూహక్కులు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. పేదల సంక్షేమం, ఆస్తి భద్రతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా చేపట్టిన రీ సర్వేలు, భూ విధానాల కారణంగా ఏర్పడిన సమస్యలను పరిష్కరిస్తూ పేదలకు శాశ్వత భూహక్కులు కల్పిస్తున్నామని తెలిపారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు పరిష్కారం చూపుతూ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ. 50 వేల కోట్ల విలువైన ఆస్తి హక్కులను పేదలకు అందిస్తున్నామని వెల్లడించారు.

విజయవాడ నగరంతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పేదలకు పట్టాలు అందించాలన్న సంకల్పంతో మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని మంత్రి తెలిపారు. పాత నిబంధనల కారణంగా పెద్ద సంఖ్యలో పేదలకు పట్టాలు అందించే అవకాశం లేకపోవడంతో, నారా లోకేష్ విదేశీ పర్యటనలో ఉన్నప్పటికీ అర్ధరాత్రి వరకు అధికారులతో సంప్రదింపులు జరిపి నిబంధనల్లో మార్పులకు కృషి చేశారని చెప్పారు. ఈ కృషి ఫలితంగానే జీవో 30 రూపకల్పన జరిగిందని, అనంతరం జీవో 306, 618 వంటి ఉత్తర్వుల ద్వారా మరింత మంది లబ్ధిదారులకు ప్రయోజనం కల్పించామని వివరించారు.

మంగళగిరి, విశాఖపట్నం, విజయవాడ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేదలకు దాదాపు రూ. 50 వేల కోట్ల విలువైన ఆస్తి హక్కులను పారదర్శకంగా కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. శెట్టిపల్లి, ఒంటిమిట్ట, గుడ్లవల్లేరు, ఏలూరు, నెల్లూరు, రంగాపురం, తాటిపూడి, అంబాజీపేట తదితర ప్రాంతాల్లో దశాబ్దాలుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న భూ సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఇప్పటివరకు ఎనిమిది సార్లు జిల్లా కలెక్టర్ల సమావేశాలు నిర్వహించి భూ సమస్యల పరిష్కారంపై నిరంతరం సమీక్షిస్తున్నామని చెప్పారు. సీఎస్, సీసీఎల్ఏ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహిస్తూ చివరి లబ్ధిదారుడికి కూడా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

గత పాలకులు పట్టాదారు పాస్ పుస్తకాలపై తమ సొంత చిత్రాలకు ప్రాధాన్యం ఇచ్చారని, పేదలకు నిజమైన భూహక్కులు కల్పించడంపై దృష్టి పెట్టలేదని మంత్రి విమర్శించారు. కూటమి ప్రభుత్వం మాత్రం పేదల ఆస్తులకు శాశ్వత భద్రత కల్పించే విధంగా స్పష్టమైన హక్కు పత్రాలను అందిస్తోందన్నారు. బుడమేరు వరదల సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 13 రోజుల పాటు రాత్రింబవళ్లు ప్రజల మధ్యే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించారని మంత్రి గుర్తుచేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంతో పాటు భావితరాల భవిష్యత్తుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ బలమైన పునాదులు వేస్తున్నారని తెలిపారు.

**దశాబ్దాల నాటి పేదల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం :** రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి మరియు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్

రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ...లి గత మూడు, నాలుగు దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని పేదల స్థల సమస్యలకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతూ ఆస్తి హక్కులు కల్పిస్తోందని అన్నారు. విజయవాడలో దాదాపు 26,400 మందికి శాశ్వత పట్టాలు అందించడం ద్వారా సుమారు రూ. 28,110 కోట్ల విలువైన ఆస్తి ప్రయోజనం లభిస్తోందని తెలిపారు. ఒక్కో కుటుంబానికి సుమారు రూ. 60 లక్షల నుంచి రూ. కోటి వరకు ప్రయోజనం కలిగే అవకాశం ఉందన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ వంటి విధానాలకు స్వస్తి పలికి, ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించేలా రాజముద్రతో కూడిన స్పష్టమైన పట్టాలను అందిస్తున్నామని చెప్పారు.

పేదల కోసం పక్కా ఇళ్ల నిర్మాణం, 'దీపం' పథకం ద్వారా గ్యాస్ సిలిండర్ల పంపిణీ, విద్యార్థుల కోసం 'తల్లికి వందనం' వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా విజయవాడ, గుంటూరు వంటి నగరాల్లోని ఆసుపత్రులకు వారు సులభంగా చేరుకుని వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం, సాధికారత కల్పించడం ద్వారా కుటుంబాలు, తద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వం విశ్వసిస్తోందన్నారు. పేదలకు భూమిపై శాశ్వత హక్కు కల్పించడం వారి జీవితాల్లో భరోసా, భద్రతకు ప్రతీకగా నిలుస్తుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

**ఇళ్ల పట్టాలతో పేదల జీవితాల్లో పండుగ వాతావరణం :** విజయవాడలో 26,401 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందించడం సంతోషకరం : రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

విజయవాడ నగరంలో 26,401 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. తన 25 ఏళ్ల రాజకీయ జీవితంలో లబ్ధిదారుల ముఖాల్లో ఇంతటి ఆనందాన్ని ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నారు. కొండ ప్రాంతాల్లో దశాబ్దాలుగా ఎండనకా, వాననకా కష్టపడి ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్న 12 వేల మందికి పైగా పేదలకు శాశ్వత ఇళ్ల పట్టాలు అందించడం గర్వకారణమని మంత్రి తెలిపారు. ఇళ్ల పట్టాల ద్వారా పేదలకు తమ ఆస్తిపై శాశ్వత హక్కుతో పాటు భద్రత, భరోసా లభిస్తుందని చెప్పారు.

పిల్లల చదువులు, వారి భవిష్యత్ అవసరాలు, వివాహాలు, బ్యాంకు రుణాలు వంటి కీలక సందర్భాల్లో ఈ పట్టాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని మంత్రి వివరించారు. పేదల ఆస్తికి చట్టబద్ధమైన హక్కును కల్పించడం ద్వారా వారి జీవితాల్లో భద్రతను పెంచే అవకాశం ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో బాధితులుగా మిగిలిపోయిన ప్రజలను నేడు లబ్ధిదారులుగా మార్చిన ఘనత ఎన్డీయే కూటమి ప్రభుత్వానిదేనని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. పేదల కన్నీళ్లు తుడిచి, వారి జీవితాల్లో పండుగ వాతావరణాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వేలాది కుటుంబాలకు శాశ్వత ఆస్తి హక్కు కల్పించినందుకు గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తరఫున అధికారులందరికీ మంత్రి నాదెండ్ల మనోహర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పేదల సంక్షేమం, వారి ఆస్తి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

**25 వేల కుటుంబాలకు ఉచిత ఇళ్ల పట్టాలు : పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని)**

నగరంలో దాదాపు 50 ఏళ్లుగా పేదలు నివాసముంటున్న ఇళ్లను క్రమబద్ధీకరించి వారికి శాశ్వత హక్కులు కల్పించాలన్న ప్రజాప్రతినిధుల విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తక్షణమే స్పందించి పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రత్యేక చొరవతో పేదలందరికీ శాశ్వత భూహక్కులు కల్పించే కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. విజయవాడ నగరంతో పాటు గన్నవరం, నందిగామ, మైలవరం, తిరువూరు, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో మొత్తం 25 వేల కుటుంబాలకు, సుమారు లక్ష మందికి ప్రయోజనం చేకూరేలా ఉచితంగా ఇళ్ల పట్టాలు అందజేస్తున్నట్లు తెలిపారు.

విజయవాడలో గజం స్థలం ధర రూ. 70 వేల నుంచి రూ. లక్ష వరకు ఉన్న పరిస్థితుల్లో పేదలకు ఉచితంగా సొంతింటి హక్కును కల్పించడం గొప్ప కార్యక్రమమన్నారు. మంగళగిరిలో మంత్రి నారా లోకేష్ ప్రారంభించిన ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కొనసాగించడం సంతోషకరమన్నారు.

విజయవాడ నగరానికి ఎలాంటి కష్టం వచ్చినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుండి ప్రజలను ఆదుకుంటున్నారని ఎంపీ తెలిపారు. గతంలో భారీ వరదల సమయంలో 12 రోజుల పాటు నగరంలోనే ఉండి బాధితులకు అండగా నిలిచారని గుర్తుచేశారు. రాబోయే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలతో పాటు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మక 'సరస్ మేళా' కూడా విజయవాడలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

**పేదల ఇళ్ల స్థలాలకు ఉచితంగా సంపూర్ణ హక్కులు :** శాసనసభ్యులు బొండా ఉమా మహేశ్వరరావు

శాసనసభ్యులు బొండా ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో పేదల సొంతింటి కలను నిజం చేస్తూ, వారి ఇళ్ల స్థలాలపై సంపూర్ణ హక్కులు కల్పించే ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో 150 గజాల లోపు నివాసాలకు జీవో 30, 306, 615, తాజాగా జీవో 618 ద్వారా ఉచితంగా సంపూర్ణ హక్కులతో పాటు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. సెంట్రల్ నియోజకవర్గంలోని దేవీనేని గాంధీపురం, చుట్టుగుంట తదితర ప్రాంతాలతో పాటు ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా సుమారు 26 వేల మందికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. మార్కెట్ విలువ ప్రకారం రూ. 12 వేల కోట్ల నుంచి రూ. 25 వేల కోట్ల విలువైన ఆస్తులపై ప్రజలకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా హక్కులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. దసరా పండుగకు ముందే పేదలకు ఈ విలువైన కానుక అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు బొండా ఉమా కృతజ్ఞతలు తెలిపారు.

**పేదల పట్టాలకు సంపూర్ణ హక్కులు కల్పించాం : ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ..** ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ... నేడు పేద ప్రజల ముఖాల్లో పండుగ వాతావరణం కనిపిస్తోందని అన్నారు. దశాబ్దాలుగా ఉన్న పట్టాల సమస్యకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ శాశ్వత పరిష్కారం చూపారని తెలిపారు.

గతంలో ఇచ్చిన పట్టాలకు పూర్తి స్థాయి హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ సౌకర్యం అందించడం వల్ల ఒక్కో కుటుంబానికి రూ. 60-70 లక్షల నుంచి రూ. 1.50 కోట్ల వరకు ఆస్తి విలువ ప్రయోజనం చేకూరే అవకాశం ఉందన్నారు. అందరికీ రిజిస్ట్రేషన్లు పూర్తయ్యే వరకు కూటమి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు అండగా ఉంటారని గద్దె రామ్మోహన్ స్పష్టం చేశారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీ వర్ల రామయ్య, శాసనసభ్యులు తంగిరాల సౌమ్య, శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య, కొలికపూడి శ్రీనివాసరావు, యార్లగడ్డ వెంకట్రావు, దూదేకుల సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్ స్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ గొట్టుముక్కల రఘురామ రాజు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీషా, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ధ్యాన్ చంద్ర. హెచ్‌ఎమ్, తదితరులు పాల్గొన్నారు.

# కిటెక్స్ ఫ్యాక్టరీని సందర్శించిన మంత్రి నారా లోకేష్

- **ఏపీలో టెక్స్‌టైల్, దుస్తుల తయారీ రంగంలో పెట్టుబడులకు ఆహ్వానం**



**కొచ్చి, సెప్టెంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్):** కేరళ రాష్ట్ర పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మంగళవారం కొచ్చిలో కిటెక్స్ గార్మెంట్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సబు ఎం. జాకబ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టెక్స్‌టైల్, దుస్తుల తయారీ రంగంలో ఉన్న అవకాశాలు, పెట్టుబడులు, తయారీ సామర్థ్యాల విస్తరణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధికి ఉన్న అవకాశాలపై చర్చించారు.

ఆంధ్రప్రదేశ్‌లో టెక్స్‌టైల్, అపారెల్ రంగానికి అనుకూలమైన వాతావరణం, అందుబాటులో ఉన్న వనరులు, మౌలిక వసతులు, పెట్టుబడులకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలను మంత్రి లోకేష్ వివరించారు. రాష్ట్రంలో ఉన్న అవకాశాలను పరిశీలించి ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి ప్రయాణంలో కిటెక్స్ సంస్థ భాగస్వామ్యం కావాలని ఆయన ఆహ్వానించారు. రాష్ట్రంలో తయారీ రంగాన్ని విస్తరించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి ఊతమివ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

కిటెక్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సబు ఎం. జాకబ్ ఆహ్వానం మేరకు మంత్రి నారా లోకేష్ కొచ్చిలోని కిటెక్స్ గార్మెంట్స్ తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యకలాపాలు, ఉత్పత్తి ప్రక్రియ, ఆధునిక తయారీ విధానాలు, ఇంటిగ్రేటెడ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆపరేషన్స్‌ను మంత్రి ప్రత్యక్షంగా పరిశీలించారు.

భారతదేశంలోని ప్రముఖ దుస్తుల తయారీ సంస్థల్లో ఒకటిగా ఉన్న కిటెక్స్ అనుసరిస్తున్న తయారీ విధానాలు, టెక్స్‌టైల్ రంగంలో సంస్థ కార్యకలాపాలపై మంత్రి వివరాలు తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇదే తరహాలో తయారీ, పెట్టుబడి అవకాశాలను విస్తరించే అంశంపై సమావేశంలో చర్చించినట్లు అధికారులు తెలిపారు.

# జర్నలిస్టుల భద్రతకు హైపవర్ కమిటీ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, హత్యలు, వేధింపుల కేసుల పరిశీలనతో పాటు జర్నలిస్టుల భద్రత, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ఈ దిశగా హైపవర్ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం బుధవారం జి.ఓ. జారీ చేసింది.

జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. జర్నలిస్టులకు అవసరమైన మీడియా అక్రిడిటేషన్లు, హెల్త్ ఇన్సూరెన్స్ వంటి సదుపాయాలను పునరుద్ధరించింది.

2016 లో ఏర్పాటు చేసిన హైపవర్ కమిటీ జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో కీలకంగా పనిచేసింది. జర్నలిస్టుల భద్రత, సంక్షేమానికి సంబంధించిన పలు సమస్యలు పరిష్కారం కాకుండా మిగిలిపోయాయని జర్నలిస్టు సంఘాలు పేర్కొంటున్నాయి. జర్నలిస్టులపై జరిగిన దాడులు, హత్యలు, వేధింపుల ఘటనల్లో బాధితులకు న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని జర్నలిస్టు సంఘాలు పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చాయి.

ఫోర్త్ ఎస్టేట్‌గా భావించే జర్నలిజం స్వేచ్ఛను, విలువలను పరిరక్షించడంతో పాటు ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులకు భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

ఈ నేపథ్యంలో రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఉన్నతాధికారులతో పలుమార్లు చర్చించి జర్నలిస్టుల హైపవర్ కమిటీ ఏర్పాటుపై చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ప్రభుత్వం హైపవర్ కమిటీ ఏర్పాటుకు సంబంధించిన జి.ఓ.ను విడుదల చేసింది.

**హైపవర్ కమిటీ ఏర్పాటు ఇలా..**

రాష్ట్ర హోంశాఖ మంత్రి – చైర్మన్

సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి – వైస్ చైర్మన్

హోం, సాధారణ పరిపాలన (పొలిటికల్) శాఖల ముఖ్య కార్యదర్శులు, ఎక్స్-అఫీషియో సెక్రటరీ, సాధారణ పరిపాలన శాఖ, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్).

జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు – సభ్యులు

సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ మెంబర్ కన్వీనర్

ఈ కమిటీ జర్నలిస్టులపై జరిగే దాడులు, హత్యలు, వేధింపులు తదితర అంశాలను పరిశీలించి, బాధిత జర్నలిస్టులకు న్యాయం జరిగేలా చర్యలకు సిఫార్సులు చేయడంతో పాటు జర్నలిస్టుల భద్రత, సంక్షేమానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి దోహదపడనుంది.

హైపవర్ కమిటీ ఏర్పాటు పట్ల రాష్ట్రంలోని జర్నలిస్టు సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. జర్నలిస్టుల భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ కమిటీని ఏర్పాటు చేసిన కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుకు, సమాచార,పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ కొలుసు పార్థసారధికి జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు..

# బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో ఏపీ బీజేపీ అధ్యక్షుడి భేటీ

- **పార్టీ బలోపేతం, సంస్థాగత అంశాలు, భవిష్యత్ కార్యక్రమాలపై చర్చ**



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీని మరింత బలోపేతం చేయడం, పార్టీ సంస్థాగత కార్యకలాపాలను విస్తృతం చేయడం, భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించేందుకు ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ బుధవారం న్యూఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలో పార్టీ ప్రస్తుత పరిస్థితి, సంస్థాగతంగా పార్టీని మరింత పటిష్టం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాల విస్తరణ తదితర అంశాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు తెలిసింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించడం, పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకోవడం, ప్రజా సమస్యలను గుర్తించి వాటిపై స్పందించే విధానంపై కూడా చర్చ జరిగినట్లు తెలిపారు.

పార్టీని బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మరింత బలోపేతం చేయడం, నాయకులు, కార్యకర్తలను ప్రజా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం, కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం వంటి అంశాలపై భవిష్యత్ కార్యాచరణను రూపొందించడంపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు.

రాష్ట్రంలో పార్టీ విస్తరణకు సంబంధించి జాతీయ నాయకత్వం నుంచి అవసరమైన మార్గదర్శకాలు, సూచనలు తీసుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సంస్థాగతంగా బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# ప్రజా సేవే ప్రధాని మోదీ మార్గం

- **ఆరోగ్య సేవలకు బీజేపీ ప్రాధాన్యత**
- **ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్**



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్ల సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని బీజేపీ నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా తూర్పు నియోజకవర్గంలోని వెంగయ్యనగర్ నాలుగో లైనులో మెడికల్ హెల్త్ చెకప్ కార్యక్రమం నిర్వహించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చరక కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఆంధ్ర హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన కార్యక్రమాన్ని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సేవ లక్ష్యాలతో మోదీ 25 ఏళ్లుగా ప్రజా జీవితంలో కొనసాగుతున్నారని, ఆయన సేవా ప్రస్థానం యువత, పార్టీ కార్యకర్తలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆరోగ్యం ప్రతి కుటుంబానికి ముఖ్యమని, ముందస్తు వైద్య పరీక్షలతో అనారోగ్యాలను గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పేదలు, బలహీన వర్గాలు, బీసీ వర్గాల ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో హెల్త్ చెకప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ కార్యక్రమాలతో పాటు ప్రజా సేవలోనూ బీజేపీ కార్యకర్తలు ముందుండాలని, ఆరోగ్యం, విద్య, ఉపాధి, సంక్షేమ రంగాల్లో ప్రజలకు అండగా నిలవడమే నిజమైన సేవ అని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ వైద్య శిబిరాలు, రక్తదాన కార్యక్రమాలు, ఇతర సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ జిల్లాలో గత 15 రోజులుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, సేవా కార్యక్రమాలతో పాటు రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి తుళ్లిమిల్లి రామకృష్ణ, సేవా సంకల్ప్ అభియాన్ జిల్లా కన్వీనర్ భజరంగ్ రామకృష్ణ, మోతే శేషగిరి, మల్లెల గోపి, కామేపల్లి వెంకటేశ్వర్లు, ధవళేశ్వరపు వెంకటరమణ, కసినబోయిన శ్రీనివాస్, పేరేచర్ల గోపి, దుర్గ ప్రసాద్, కృష్ణిపాటి నారాయణరెడ్డి, మండల అధ్యక్షులు రావుల రాజశేఖర్, గట్టుపల్లి అబ్రహం, కత్తిమేరీ సరోజినీ, పురుషోత్తం తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆంధ్ర హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కె. నాగార్జున, డాక్టర్ పి. మౌనిక, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితాపై రాహుల్ గాంధీ తప్పుడు ప్రచారం ఆరోపణలు




- **బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మీడియా విభాగం ఇన్‌చార్జి దీలీప్ కిలారు**

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ఓటర్ల జాబితా అంశంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మీడియా విభాగం ఇన్‌చార్జి దీలీప్ కిలారు విమర్శించారు. ఢిల్లీలోని బేలా ఎస్టేట్ ఓటర్ల అంశంపై ఎన్నికల సంఘం ఇప్పటికే వివరణ ఇచ్చిందని తెలిపారు. ఎన్నికల సంఘం ప్రకారం, బేలా ఎస్టేట్‌లోని నివాస గృహాలు 2022--23లో తొలగించడంతో అక్కడి భౌతిక, నివాస పరిస్థితుల్లో మార్పు వచ్చిందని, అందువల్ల సంబంధిత ఓటర్ల పేర్లను ఏఎస్‌డీడీ జాబితాలో చేర్చినట్లు పేర్కొన్నారు.

అర్హత ఉన్న ఓటర్లు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఫారం--6 ద్వారా ఓటరు జాబితాలో తమ పేర్లను తిరిగి నమోదు చేసుకునే అవకాశం ఉందని దీలీప్ కిలారు తెలిపారు. బేలా ఎస్టేట్ వ్యవహారంలో ఓటర్ల పేర్ల తొలగింపుపై రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలకు ఎన్నికల సంఘం తన ప్రక్రియ, కారణాలను వెల్లడించిందని అన్నారు. అయితే, సెప్టెంబరు 30 నాటికి అందుబాటులో ఉన్న తాజా నివేదికల ప్రకారం, బేలా ఎస్టేట్‌లో తొలగించిన 728 మందిలో సుమారు 475 మంది తిరిగి చేర్పు కోసం దరఖాస్తు చేసినట్లు ఢిల్లీ ఎన్నికల అధికారులు వెల్లడించారు.

బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధిగా రాహుల్ గాంధీ ఎన్నికల ప్రక్రియపై వ్యాఖ్యలు చేసే ముందు ఎన్నికల సంఘం ఇచ్చిన వివరణను పరిగణనలోకి తీసుకోవాలని దీలీప్ కిలారు అన్నారు. ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా చట్టబద్ధమైన ప్రక్రియలో భాగంగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

# రైతులకు కేంద్రం శుభవార్త



**న్యూఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** రైతులకు మెరుగైన ధరలు కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2027-28 రబీ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించిన పలు పంటల కనీస మద్దతు ధరలను పెంచింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఉత్పత్తి వ్యయంపై రైతులకు కనీసం 50 శాతం మార్జిన్ ఉండేలా మద్దతు ధరలను నిర్ణయించినట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

తాజా నిర్ణయం ప్రకారం గోధుమల కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ. 25 పెరిగి రూ. 2,610కి చేరింది. గోధుమల ఉత్పత్తి వ్యయం క్వింటాలుకు రూ. 1,264గా ఉన్న నేపథ్యంలో దానికి రెండింతలకు పైగా మీరాని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. బార్లీ మద్దతు ధర రూ. 2,150 నుంచి రూ. 2,286కు పెరిగింది. శనగల మీరా రూ. 5,875 నుంచి రూ. 5,958కు, మసూర్ పప్పు ధర రూ. 7,000 నుంచి రూ. 7,390కు పెరిగింది.

నూనెగింజల విభాగంలోనూ రైతులకు ఊరట కల్పించేలా ధరలను పెంచారు. ఆవాల మీరా క్వింటాలుకు రూ. 6,200 నుంచి రూ. 6,613కు పెరిగింది. కుసుమల మద్దతు ధర రూ. 6,540 నుంచి రూ. 7,215కు చేరింది. తాజా నిర్ణయంతో 2027-28 మార్కెటింగ్ సంవత్సరంలో 324 లక్షల టన్నుల రబీ పంటల కొనుగోళ్లకు సంబంధించి రైతులకు సుమారు రూ. 90,962 కోట్ల విలువైన చెల్లింపులు జరుగుతాయని కేంద్రం అంచనా వేసింది.

వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ సిఫార్సులు, వివిధ పంటల ఉత్పత్తి వ్యయం, దేశీయ-అంతర్జాతీయ మార్కెట్లలో ధరల ధోరణులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని రబీ పంటల మీరాలను నిర్ణయించినట్లు కేంద్రం తెలిపింది. వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం వంటి అంశాల నేపథ్యంలో రైతులకు ధరల పరంగా భరోసా కల్పించడమే తాజా నిర్ణయం ఉద్దేశమని పేర్కొంది.

**ఢిల్లీలో ఏఐ ఆధారిత ట్రాఫిక్ వ్యవస్థకు ఆమోదం :** దేశ రాజధాని ఢిల్లీలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు కృత్రిమ మేధ ఆధారిత ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఢిల్లీ పోలీసులు ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టుకు రూ. 1,789.52 కోట్ల అంచనా వ్యయం ఉంటుంది. మొత్తం 42 కీలక ట్రాఫిక్ కారిడార్లను ఈ వ్యవస్థ పరిధిలోకి తీసుకురానున్నారు.

ప్రాజెక్టును 24 నెలల్లో మూడు దశల్లో అమలు చేయనున్నారు. అనంతరం ఐదేళ్లపాటు ఆపరేషన్, నిర్వహణ కొనసాగుతుంది. ట్రాఫిక్ ప్రవాహాన్ని పర్యవేక్షించడం, రద్దీ ప్రాంతాలను గుర్తించడం, పరిస్థితులకు అనుగుణంగా ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరచడం వంటి అంశాల్లో ఏఐ ఆధారిత సాంకేతికతను వినియోగించనున్నారు.

**గ్రీన్ ఎనర్జీ కారిడార్ మూడో దశకు కేబినెట్ ఆమోదం :** పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచే దిశగా గ్రీన్ ఎనర్జీ కారిడార్ మూడో దశకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సుమారు రూ. 1.86 లక్షల కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా దేశవ్యాప్తంగా పునరుత్పాదక విద్యుత్ ప్రసార మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయనున్నారు.

2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించాలన్న జాతీయ లక్ష్యంలో ఈ ప్రాజెక్టు కీలకంగా ఉండనుంది. రాష్ట్రాల మధ్య 135 గిగావాట్ల వరకు పునరుత్పాదక విద్యుత్‌ను ప్రసారం చేయడానికి అవసరమైన అంతర్రాష్ట్ర ప్రసార వ్యవస్థను బలోపేతం చేయనున్నారు. గ్రిడ్, స్మార్ట్‌గ్రిడ్ మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థలను ఏర్పాటు చేయడం ద్వారా పునరుత్పాదక విద్యుత్ సరఫరాలో స్థిరత్వాన్ని పెంచే చర్యలు చేపట్టనున్నారు.

## సిరికొండ గ్రామ పంచాయతీ సర్పంచ్ పాలకవర్గం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డికి సమస్యల వినతిపత్రం సమర్పణ



**సిరికొండ, సెప్టెంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :**
నిజామాబాద్ రూరల్ సిరికొండ గ్రామ పంచాయతీ సర్పంచ్ మల్లెల సాయిచరణ్, ఆధ్వర్యంలో గ్రామ పాలకవర్గ సభ్యులు నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు రేకులపల్లి భూపతిరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి, గ్రామాభివృద్ధికి సంబంధించి పలు కీలక సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు సిరికొండ గ్రామానికి అదనంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ప్లాట్లను తక్షణమే అర్హులకు పంపిణీ చేసి, వాటి నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని గ్రామంలో శాశ్వత తాగునీటి ఎద్దడి నివారణకు 1,00,000 లీటర్ల (100 KL) మరియు 90,000 లీటర్ల (90 KL) సామర్థ్యం గల రెండు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయాలని పోచమ్మ గుడి నుండి దొండ్లవాగు వరకు రోడ్డుకు ఇరువైపులా సిమెంట్ డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టాలని ట్రాఫిక్ సమస్య నివారణకు సిరికొండ బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మండల మరియు గ్రామ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు 30 పడకల ఆసుపత్రిని మంజూరు చేయడంతో పాటు, ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్స్ మరియు ఇతర వైద్య సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్సీ కాలనీలోని చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంక్షేమం మరియు ఆరోగ్య సేవల కోసం నూతన అంగన్‌వాడీ భవనాన్ని మంజూరు చేయాలని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ప్రీ-ప్రైమరీ పాఠశాలకు అదనపు తరగతి గదులను మంజూరు చేయాలని గ్రామంలో ఇండ్ల మధ్య గుండా వెళ్తున్న ప్రమాదకరమైన 33 కేవీ విద్యుత్ లైన్‌ను ఊరి బయటకు తరలించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని గత 20 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సర్వే నంబర్ 532 భూసమస్యను పరిష్కరించి, నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరారు గ్రామ పాలకవర్గం విన్నవించిన సమస్యలపై ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి సానుకూలంగా స్పందించారు. గ్రామాభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, ఈ సమస్యలన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గ్యామ శోభన్ వార్డు మెంబర్లు అల్లిపురం కిషన్, ఇందూరి అమృత, చిట్యాల రంజిత్, ఎరుకల ఎల్లయ్య, కొలిపాక అశ్విని, కానపురం సునీత, బాధవత్ తిరుపతి, బోల్గం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ రైల్వే స్టేషన్,రైల్వే కాలనీల్లో నీటి నాణ్యత తనిఖీలను ముమ్మరం చేసిన దక్షిణ మధ్య రైల్వే



**నిజామాబాద్, సెప్టెంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :**
21 ఆగస్టు నుండి 28 సెప్టెంబర్ 2026 వరకు నిజామాబాద్ రైల్వే స్టేషన్,రైల్వే కాలనీల్లో సేకరించిన 531 నీటి నమూనాలు తాగునీటికి అనుకూలంగా ఉన్నట్లు నిర్ధారణ.దక్షిణ మధ్య రైల్వే (SCR) పరిధిలో ప్రయాణికులు,రైల్వే వ్యవస్థకు సురక్షితమైన,పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తోంది.ఇందులో భాగంగా హైదరాబాద్ డివిజన్ పరిధిలోని నిజామాబాద్ రైల్వే స్టేషన్,అనుబంధ రైల్వే కాలనీల్లో తనిఖీలు,నిర్వహణ చర్యలు,నీటి నాణ్యత పర్యవేక్షణను మరింత బలోపేతం చేసింది.ఈ తనిఖీల్లో భూగర్భ జల వనరులు,మున్సిపల్ నీటి సరఫరా,నీటి నిల్వ సదుపాయాలు,క్లోరినేషన్ ప్రక్రియలు,నీటి పంపిణీ వ్యవస్థలను పరిశీలిస్తున్నారు.నీటి నాణ్యతపై మరింత సమర్థవంతమైన పర్యవేక్షణ కోసం,అవశేష క్లోరిన్ స్థాయిలను ప్రతిరోజూ తనిఖీ చేయడంతో పాటు,నీటిలో ఈ.కోలీ (E.coli) వంటి కలుషితాల ఉనికిని గుర్తించేందుకు క్రమం తప్పకుండా బ్యాక్టీరియాలాజికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.21 ఆగస్టు నుండి సెప్టెంబర్ 28, 2026 వరకు నిజామాబాద్ రైల్వే స్టేషన్,రైల్వే కాలనీల్లో సేకరించిన నీటి నమూనాలను పరీక్షించగా,అన్ని ప్రమాణాల ప్రకారం నీటి నాణ్యత సంతృప్తికరంగా ఉన్నట్లు నిర్ధారించారు.

**పర్యవేక్షణలో ముఖ్యమైన అంశాలు:**

★ రైల్వే స్టేషన్,రైల్వే కాలనీల్లో తాగునీటికి సంబంధించిన 531 నీటి నమూనాలను అవశేష క్లోరిన్ స్థాయిల కోసం పరీక్షించగా,అన్ని నమూనాలు సంతృప్తికరంగా ఉన్నట్లు నిర్ధారణ అయింది.ఒక్క నమూనా కూడా వినియోగానికి అనర్హంగా గుర్తించబడలేదు.

★ 134 తాగునీటి నమూనాలను బ్యాక్టీరియాలాజికల్ పరీక్షలు నిర్వహించగా,ఏ ఒక్క నమూనా కూడా అసురక్షితంగా గుర్తించబడలేదు.అలాగే,ఏ నమూనా కూడా ఈ.కోలీ (E.coli) పాజిటివ్‌గా గుర్తించబడలేదు.

★ ఇంజినీరింగ్,వైద్య విభాగాల అధికారులు సంయుక్తంగా తాగునీటి వనరులు,గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్లు (GLRs),హై లెవల్ రిజర్వాయర్లు (HLRs) ను తనిఖీ చేశారు.

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ,నీటి నాణ్యత పై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ,తాగునీరు ఎటువంటి కలుషితానికి గురికాకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.రైల్వే స్టేషన్లలో సరఫరా చేసే తాగునీరు ఇండియన్ రైల్వేస్ మెడికల్ మాన్యువల్ లో నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.అలాగే,తరచుగా పరీక్షలు,పర్యవేక్షణ చేపట్టడం ద్వారా జోన్ వ్యాప్తంగా ఇదే స్థాయి అప్రమత్తతను కొనసాగించాలని అధికారులు,పర్యవేక్షకులను ఆయన ఆదేశించారు.ప్రయాణికులు,రైల్వే కాలనీ నివాసితులందరికీ శుభ్రమైన,సురక్షితమైన,స్వచ్ఛమైన తాగునీరు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.

# బదిరులకు అండగా ఉంటా

● అంతర్జాతీయ సంకేత భాషా దినోత్సవంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్....






**నిజామాబాద్, సెప్టెంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :**
జిల్లాలోని బదిరులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు.డెఫ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్ లో అంతర్జాతీయ సంకేత భాషా దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....బధిరులకు మేథోశక్తి ఎంతో ఉంటుందన్నారు.సామాన్యులకు ధీటుగా పోటీ ప్రపంచంలో ముందుకు వెళ్ళడం అభినందనీయమన్నారు.బదిరులుగా ఉంటూ ప్రభుత్వ ఉద్యోగులుగా స్థిర పడటం సంతోషంగా ఉందన్నారు.లోపాన్ని పట్టించుకోకుండా తమ పని తాము చేసుకుంటూ పోవాలని విజయం వరిస్తుందన్నారు.కార్యక్రమంలో డెఫ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్ కుమార్,ప్రధాన కార్యదర్శి మహేష్,19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ,జ్యోతి మురళి తదితరులు పాల్గొన్నారు.

## నూతన క్రీడా భవన నిర్మాణ పనులను పరిశీలించిన తె.యూ.ఉపకులపతి



**నిజామాబాద్, (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరి రావు యూనివర్సిటీ నూతన క్రీడా భవన నిర్మాణ పనులను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యం.యాదగిరి తో కలిసి ప రిశీలించారు. నాణ్యత లో రాజీపడకూడదని,పనులను త్వరిత్తగతిన పూర్తి చేయాలని ఆయన సంబందిత అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో VC తో పాటు EC మెంబర్ ప్రొఫెసర్ ఆంజనేయులు,స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ బాలకిషన్,ఇంజనీర్ వినోద్ లు పాల్గొన్నారు.

## బస్తి దావకాన,టీహబ్ లను ఆకస్మిక తనిఖీ చేసిన డిఎంహెచ్వో



**నిజామాబాద్, సెప్టెంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.బి.రాజశ్రీ నిజామాబాద్ పట్టణంలోని మిర్చి కాంపౌండ్ నందు గల బస్తి దావకాన,ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలోని టార్గెటివ్ కేర్,తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా బస్తి దావకాన యందు ఔషధారణ స్టాకు రిజిస్టర్,ఔషధాల పంపిణీ రికార్డులను,ఎన్సిడి స్క్రీనింగ్ రికార్డులను, ఫాలోఅప్ రిజిస్టర్,హాజరు పట్టిక,రిఫరల్ సర్వీసెస్ రిజిస్టర్ లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఔషధారణ స్టాక్ రిజిస్టర్ పంపిణీ రిజిస్టర్లు ఇతర రికార్డులు అసంపూర్తిగా ఉండరాదని జీవనశైలి వ్యాధుల నిర్ధారణ పరీక్షలు 100% పూర్తిచేయాలని,అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని,దావఖాన కి వచ్చే రోగులతో మర్యాదగా గౌరవంగా ప్రవర్తించాలన్నారు.ప్రభుత్వ సాధారణ ఆస్పత్రి ఆవరణలోని పాలియేటివ్ కేర్ సెంటర్ ను సందర్శించి నొప్పి నివారణ మందులు అందుబాటులో ఉండాలని,నర్సింగ్ కేర్,స్టాఫ్ డ్యూటీ రోస్టర్ అనుగుణంగా విధులు నిర్వహించాలని,సమయానికి విదులకు హాజరు కావాలన్నారు.అదేవిధంగా తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్ షాంపుల్స్ సేకరణ పెంచాలని,ఏజెంట్స్ స్టాక్ పొజిషన్ ఎప్పటికప్పుడు నమోదు చేయాలని,ఔషదాలని అందుబాటులో ఉంచాలని,రిపోర్టులను సమయానికి రోగులకు చేరవేయాలని సిబ్బందికి తెలియజేశారు.తనిఖీ సమయంలో బస్తీ దావకాన సిబ్బంది,పాలియేటివ్ కేర్ నందు డాక్టర్ చైతన్య,టీ హబ్ వైద్యురాలు డాక్టర్ దివ్య వైద్య సిబ్బంది ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేకి: ఇది కాలం తెచ్చిన కరువు కాదు కాంగ్రెస్ పార్టీ తెచ్చిన కరువు: మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్.



**గుర్రంపోడు, సెప్టెంబరు 30(జర్నలిస్ట్ ఫైల్):** కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేకి అని ఇది కాలం తెచ్చిన కరువు కాదు కాంగ్రెస్ పార్టీ తెచ్చిన కరువు అని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన గుర్రంపోడు మండలంలోని కే వెంకటాపురం గ్రామంలో బలు గూరి లింగయ్య,మంటిపల్లి లింగయ్య, ఎరుకల బిక్షం రైతుల ఎండిపోయిన పంటలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ జలాశయంలో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ ఎడమ కాలువకు సాగునీరు విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నీటిని పొదుపుగా వాడేందుకు సాగర్ ఎడమ కాలువకు వారబందీ ప్రకారం నీటిని విడుదల చేసేవాళ్ళమని తెలిపారు. శ్రీశైలం నుండి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జలచౌర్యానికి పాల్పడిందని అన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి వేలకు వేలు పెట్టుబడి పెట్టి వేసిన పంటలు ఎండిపోతున్నాయని ప్రభుత్వం మాత్రం సాగు నీరు ఇచ్చి పంటలను కాపాడకుండా చోద్యం చూస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని నాగార్జునసాగర్ నియోజకవర్గంలో గుంట స్థలం ఎండిపోయినా అందుకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని తెలియజేశారు. రైతుల ఆగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కాలగర్భంలో కలిసిపోక తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ బీ ఆర్ఎస్ మండల అధ్యక్షులు నాగులవంచ తిరుపతిరావు, మాజీ వైస్ ఎంపీపీ వజ్జ రామేశ్వరి ధనుంజయ, సీనియర్ నాయకులు సామల బొజ్జయ్య, సర్పంచులు జక్కల భాస్కర్, సింగం బాలకృష్ణ, అందుగుల శ్రీను,చెవ్వ రమేష్, సల్వాది సరస్వతి నగేష్, మాజీ సర్పంచులు పోలే రామచంద్రం,కామల్ల నరసింహ, మండల నాయకులు కామల్ల రాములు,సింగం ప్రవీణ్ కుమార్, నాగులవంచ నాగేశ్వర రావు,దోటి గణేష్, షేక్ సిరాజ్,చింతరెడ్డి రవీందర్ రెడ్డి,తిరందాసు అంజయ్య,మర్ల రమేష్, వనమాల మహేందర్, కుందారపు యాదగిరి, భూపతి రాజు,దోటి అనిల్,పోలే అశోక్ మరియు రైతులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి జన్మదిన వారోత్సవాలు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** శాసనమండలి సభ్యులు, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు లేళ్ళ అప్పిరెడ్డి జన్మదిన వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తమైన పూజలతో ఈ ఉత్సవాలు మొదలయ్యాయి. స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బందా రవీంద్రనాథ్, మాజీ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) నేతృత్వంలో స్థానిక బ్రాడీపేటలోని సాయిబాబా గుడిలో లేళ్ళ అప్పిరెడ్డికి అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు సిద్ధించాలని.. ప్రజాసేవలో తరించడం ద్వారా ఆయన కలకాలం వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, లేళ్ళ అప్పిరెడ్డి అభిమానుల ఆనందోత్సాహాల నడుమ బర్త్ డే కేక్ కట్ చేసారు. ఈ కార్యక్రమంలో రత్నప్రసాద్, వలివేటి వెంకటరమణ, మన్నెపల్లి హనుమంతరావు, రమణ, నారాయణ, విజయమ్మ, కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## పునరుద్ధరించిన డిఎంహెచ్ఓ కార్యాలయాన్ని ప్రారంభించిన కలెక్టర్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** మరమ్మతులు చేసి పునరుద్ధరించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ బుధవారం ప్రారంభించారు. కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఆహ్లాదభరితంగా ఉంచుకోవలసిన అవసరాన్ని తెలిపారు. కార్యాలయాల్లోని ఎక్కువ సమయం గడపడం జరుగుతుందని అటువంటి కార్యాలయాలను ఆహ్లాదకరంగా ఉంచటం వల్ల పనితీరు, సామర్థ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

**పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్**

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా సుదీర్ఘకాలం పనిచేసే బుధవారం పదవీ విరమణ చేసిన కె విజయ లక్ష్మిని జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. శేష జీవితం చక్కగా, సాఫీగా, ఆరోగ్యకరంగా సాగాలని ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించుటకు ఉపయోగించాలని ఆకాంక్షించారు. జిల్లాలో మంచి సేవలు అందించినందుకు అభినందించారు. వృత్తిని చక్కగా నిర్వర్తించిన వారు ఎప్పుడూ ప్రజల్లో గుర్తు ఉంటారని అన్నారు. స్ఫూర్తిదాయకమైన సేవలు అందించడం వలన స్వయం సంతృప్తి లభిస్తుందని పేర్కొన్నారు.

## ఫేక్ లింకులు, ఓటీపీ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



- సైబర్ నేరాలపై గుంటూరు జిల్లా పోలీసుల అవగాహన సదస్సు

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు తాడేపల్లి పోలీసులు వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఆడిటోరియంలో విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐటీ కోర్స్ ఇన్‌స్పెక్టర్ నిస్సార్ భాష, సిబ్బంది ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, ఫిషింగ్ మెసేజ్‌లు, నకిలీ కస్టమర్ కేర్ నంబర్లు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, ఆన్‌లైన్ పెట్టుబడులు, డిజిటల్ అరెస్ట్, సోషల్ మీడియా మోసాలపై విద్యార్థులకు వివరించారు.

తెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీ, పిన్, సీవీవీ, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని పోలీసులు సూచించారు. బ్యాంకులు, పోలీసులు, ప్రభుత్వ సంస్థల పేరుతో ఫోన్ చేసి వ్యక్తిగత లేదా బ్యాంకింగ్ వివరాలు అడిగినా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయడంతో పాటు షిఎవతీషిఈఅవవ.స్త్రశీజ.ఱఅలో ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం సైబర్ క్రైమ్ అవగాహన వాల్ పోస్టర్‌ను ఇన్‌స్పెక్టర్ నిస్సార్ భాష, పోలీసు సిబ్బంది, యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పోలీసు సిబ్బందితో పాటు సుమారు 400 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండటం ద్వారా ఆన్‌లైన్ మోసాలను అరికట్టవచ్చని పోలీసులు సూచించారు.

# వార్డుల్లో చెత్తాచెదారాలు కనిపిస్తే సహించం

- కాలువల్లో వెంటనే ఫీల్టు తీయించండి
- రోడ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి
- ఏ సమస్య ఉన్నా వెంటనే నా దృష్టికి తీసుకురండి
- వార్డుల్లో పర్యటించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** అన్ని వీధులను అద్దంలా, పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని, చెత్తాచెదారాలు ఎక్కడ కనిపించినా సహించబోనని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ స్పష్టం చేశారు. బుధవారం నియోజకవర్గంలోని 12,13, 14 వార్డుల్లో ఎమ్మెల్యే నసీర్ పర్యటించారు. లాలాపేట, చౌత్ర సెంటర్, మంత్రుల బజార్, సంగడిగుంట, వడ్డెరగూడెం, క్రిస్టియన్ పేట ప్రాంతాలలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలతో స్వయంగా మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు, ప్రధాన డ్రెయిన్లలో సిల్ట్ పేరుకుపోయి ఉండటాన్ని చూసి వెంటనే సంబంధిత మున్సిపల్ అధికారులను పిలిపించారు. ఎక్కడా మురుగు నిల్వలు ఉండకూడదని, వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఆటంకం లేకుండా చూసుకోవాలన్నారు అవసరమైన చోట విద్యుత్ దీపాలు, స్తంభాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని, పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. మారుమూల ప్రాంతాలకు సైతం సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. డ్రెయిన్ల నిర్మాణంతోపాటు మంచినీటి పైపు లైన్లు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంచి పాలన అందిస్తున్నామని సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ స్పష్టం చేశారు. స్థానికంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న వెంటనే తనను సంప్రదించాలని భరోసా కల్పించారు.

# పారిశుధ్య కార్మికులు, కుటుంబ సభ్యులకు మెగా వైద్య శిబిరం

- అక్టోబర్ 2న పాటిబండ్ల సీతారామయ్య పాఠశాలలో నిర్వహణ



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ప్రజారోగ్య పరిరక్షణలో కీలకంగా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యుల కోసం గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాటిబండ్ల సీతారామయ్య పాఠశాలలో మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. శిబిరానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. కార్మికులు, కుటుంబ సభ్యులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా అందించాలని సూచించారు.

శిబిరంలో వైద్య విభాగాల వారీగా వైద్యులు, కుర్చీలు, టేబుళ్లు, తాగునీరు తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కమిషనర్ తెలిపారు. డివిజన్ల వారీగా కార్మికులకు సమయాలను కేటాయించి రద్దీని నియంత్రించాలని ఆదేశించారు. అనంతరం రవీంద్రనగర్, పట్టాభిపురం ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి, నిర్మాణ పనుల అనంతరం వ్యర్థాలను కాంట్రాక్టర్లే తొలగించిన తర్వాత బిల్లులు ప్రాసెస్ చేయాలని ఇంజినీరింగ్ అది. కా ం ల క ం సూచించారు. రహదారులపై నిర్మాణ సామగ్రిని ఉంచి రాకపోకలకు ఇబ్బంది కలిగించే వారిపై వర్క్ స్టాప్ ఆర్డర్లు జారీ చేసి, సామగ్రిని సీజ్ చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారులకు సూచించారు. పర్యటనలో డిప్యూటీ కమిషనర్ సిహెచ్. శ్రీనివాస్, ఎస్ఈ జి. వెంకటేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# సుదీర్ఘ పోలీసు సేవలకు ఘన సన్మానం

- పదవీ విరమణ పొందిన ఎస్ఐ, హోంగార్డుకు ఆత్మీయ వీడ్కోలు పలికిన ఎస్పీ వకుల్ జిందాల్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా పోలీసు శాఖలో మూడు దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందుతున్న ఎస్ఐ పి. శ్రీనివాసరావు, హోంగార్డు ఎన్. వెంకటరత్నంలను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారి సుదీర్ఘ సేవలను గుర్తుచేసుకుంటూ ప్రశంసాపత్రాలు, సత్కారం నిర్వహించారు.

ఎస్ఐ పి. శ్రీనివాసరావు ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో 34 ఏళ్లపాటు, హోంగార్డు ఎన్. వెంకటరత్నం నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో 41 ఏళ్లపాటు సేవలందించారు. ఫ్యాక్షనిజం, నక్సలిజం, రౌడీయిజం వంటి సవాళ్లు తీవ్రంగా ఉన్న సమయంలో శాంతిభద్రతల పరిరక్షణ, చట్ట అమలులో వారు సమర్థవంతంగా విధులు నిర్వహించారని ఎస్పీ పేర్కొన్నారు. నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వర్తించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకొచ్చారని కొనియాడారు.

హోంగార్డు వెంకటరత్నంను పోలీసు సిబ్బందితో సమానంగా గౌరవించి ఎస్పీ సన్మానించారు. భవిష్యత్తులో పదవీ విరమణ పొందే హోంగార్డులను కూడా ఇదే విధంగా సన్మానించాలని వెల్ఫేర్ ఆర్ఐకి సూచించారు. ఉద్యోగ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించడంతో పాటు తమ పిల్లలకు ఉన్నత విద్య అందించి సమాజంలో ఉన్నత స్థాయికి తీసుకెళ్లినందుకు పదవీ విరమణ పొందుతున్న వారి కుటుంబ సభ్యులను కూడా ఎస్పీ అభినందించారు. పోలీసుల విధి నిర్వహణకు కుటుంబ సభ్యులు అందించిన సహకారం, త్యాగాలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు.

పదవీ విరమణ అనంతరం వారు ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో గడపాలని ఆకాంక్షిస్తూ ఎస్పీ వకుల్ జిందాల్ శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు శాఖకు వారు అందించిన సేవలను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఆర్ఐ సురేష్ (వెల్ఫేర్), అడ్మిన్ ఆర్ఐ కృష్ణయ్య, పోలీస్ అసోసియేషన్ నాయకులు ఏఎస్ఐ మైలా సాంబశివరావు, ఎం. లక్ష్మయ్య, ఎస్.కె. కరిముల్లా, పీఆర్వో శ్రీనివాసరావు, సహోద్యోగులు, బంధువులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# స్కూల్ కమిటీ ఎన్నికల్లో ఎంఈఓ నిర్లక్ష్యం

**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారిమఠం మండల పరిధిలోని పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) చైర్మన్ వైస్ చైర్మన్‌ల ఎన్నికల నిర్వహణలో మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఏఐవైఎఫ్ కడప



జిల్లా కార్యదర్శి పెద్దుల్లపల్లి ప్రభాకర్

ఆరోపించారు. పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాలతో సంబంధం ఉన్న అర్హులైన వ్యక్తులతో కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, కొన్ని పాఠశాలల్లో పాఠశాలతో సంబంధం లేని వ్యక్తులకు చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు కట్టబెట్టడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులపై ఉన్నప్పటికీ, ఎంఈఓ తగిన పర్యవేక్షణ చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు.

## కార్యకర్తలకు అండగా నిలుస్తున్న పార్టీ టీడీపీ : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



- టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల సంక్షేమ నిధి చెక్కు అందజేత

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు ఏటి అగ్రహారానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త డి. అంజిరెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆయన కుటుంబానికి పార్టీ కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి మంజూరైన రూ. 5 లక్షల చెక్కును అంజిరెడ్డి సతీమణి దిట్టుకుంట తులసమ్మకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే ఃa టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు శ్రీమతి గళ్ళా మాధవి బుధవారం అందజేశారు.

లిఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ...లి పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తుందని, కార్యకర్తల సంక్షేమం విషయంలో పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ఆ దిశగా కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. అనంతరం ఎన్డీయే కూటమి నేతల గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి, కూటమి నాయకులు మరియు కార్యకర్తల నుంచి అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజా సమస్యలతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పరిష్కారానికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని గళ్ళా మాధవి పేర్కొన్నారు.

## మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ సందర్భంగా 'సేవా సంకల్ప్ అభియాన్'



- పట్టాభిపురం హైస్కూల్‌లో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పురస్కరించుకుని బీజేపీ నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను పురస్కరించుకుని పట్టాభిపురం రెండో లైనులోని పట్టాభిపురం హైస్కూల్‌లో కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ అలీమ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానమంత్రి మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని బీజేపీ సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహిస్తోంది.

కార్యక్రమానికి బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పేద కుటుంబంలో జన్మించి కష్టపడి శాస్త్రవేత్తగా, దేశ రాష్ట్రపతిగా ఎదిగిన తీరు యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. కలాం చిన్ననాటి నుంచి దేశం కోసం కలలు కని, వాటిని సాకారం చేసుకునేందుకు పట్టుదలతో కృషి చేశారని పేర్కొన్నారు. విద్యార్థులు కూడా లక్ష్యాలను నిర్దేశించుకుని దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. డాక్టర్ కలాం జన్మదినం అక్టోబరు 15న నిర్వహిస్తారు. ఈ సందర్భంగా 'సేవా సంకల్ప్ అభియాన్' పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరపతిరావు, జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ సాంబశివరావు, బజరంగ్ రామకృష్ణ, నారాయణరెడ్డి, వై.వి. సుబ్బారావు, మండల అధ్యక్షురాలు భూలక్ష్మి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దారా అంబేద్కర్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ ఏర్పాటు చేయాలి



- బిజెపి,ఓబీసీ మోర్చా అధ్యక్షులు చంద్ర, నాయుడు

**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** మండలంలోని ప్రభునగర్ నందు ఉండే అంగన్వాడి కేంద్రానికి వెంటనే ప్రహరీ గోడ నిర్మించాలని బ్రహ్మంగారి మఠం మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పెద్దిరెడ్డి చంద్రఓబుల్ రెడ్డి మరియు భారతీయ జనతా పార్టీ ఓబిసి మోర్చా మండల అధ్యక్షులు సారె రామానాయుడు అలాగే కడప జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి చంద్రకాంతం ఈశ్వరయ్య అధికారులను కోరారు. చుట్టుపక్కల ఉన్న ప్రాంతంలో నివాస గృహాలు లేకపోవడం వల్ల పెద్ద పెద్ద కంపచెట్లు పెరిగి విషపూరితమైన జీవులు సంచరిస్తూ చిన్న పిల్లలను ఇబ్బంది పెడుతున్నట్లు తల్లిదండ్రులు తెలియజేశారు. కాబట్టి అధికారులు వెంటనే స్పందించి అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# నేరాల నియంత్రణకు ఆపరేషన్ త్రిశూల్ : కలెక్టర్ సియం. సాయికాంత్ వర్మ

- మాదకద్రవ్యాల నిర్మూలన
- మహిళల భద్రత
- రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి





**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా ప్రజలకు మరింత సురక్షితమైన వాతావరణం కల్పించడంతో పాటు నేరాలను సమర్థవంతంగా నియంత్రించేందుకు గుంటూరు జిల్లా యంత్రాంగం "ఆపరేషన్ త్రిశూల్" పేరుతో ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ సి యం. సాయికాంత్ వర్మ తెలిపారు.

బుధవారం జిల్లా కలెక్టరేట్లో ఆపరేషన్ త్రిశూల్ మొదటి సమావేశాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తో కలసి జిల్లా కలెక్టర్ నిర్వహించారు.

ఈ కార్యక్రమం ద్వారా ప్రధానంగా మాదకద్రవ్యాల నిర్మూలన, మహిళలపై నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజల భద్రతకు విఘాతం కలిగించే కార్యకలాపాలను అరికట్టేందుకు నిరంతరం చర్యలు చేపడతామన్నారు.

**మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం**

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటంతో పాటు డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలని పోలీస్, ఇతర అధికారులకు సూచించారు. అలాగే జిల్లాలోని మందుల షాపుల యజమానులతో ప్రాంతీయ సమావేశాలు నిర్వహించి, మత్తు పదార్థాలకు సమానమైన మందులను అమ్మకుండా అవగాహన కలిగించాలన్నారు. ఆ తదుపరి కూడా ఆ విధమైన అమ్మకాలు జరిగితే వారి రిజిస్ట్రేషన్ ను శాశ్వతంగా రద్దు చేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో నిఘా ఉంచాలన్నారు. డ్రగ్స్ హాట్‌స్పాట్లను గుర్తించాలని, పాడుబడిన భవనాలను కూల్చివేయుటకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, ఉన్నత విద్యా సంస్థలలో డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై నిరంతరం అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. గుంటూరు జి జి హెచ్ లోని ప్రస్తుత డీ–అడిక్షన్ సెంటర్‌ను అప్‌గ్రేడ్ చేయాలని సూచించారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి, డ్రగ్స్ మహమ్మారిని జిల్లా నుండి పూర్తిగా తరిమికొట్టేందుకు ప్రజలు, విద్యార్థులు కూడా భాగస్వాములు కావాలన్నారు.

**మహిళల భద్రతకు ప్రాధాన్యం**

మహిళలపై నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ, మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించడంపై దృష్టి సారించాలన్నారు. శక్తి టీమ్స్ ద్వారా మహిళలకు భద్రత, రక్షణ, గౌరవం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**రోడ్డు ప్రమాదాల నివారణ**

రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా జిల్లాలో గుర్తించిన ప్రమాదకర బ్లాక్ స్పాట్స్ పై నెలరోజుల్లోపు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల జీవన్మరణ సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. అలాగే అమరావతి రాజధాని ప్రాంతంలో వాహనాల అతివేగాన్ని నిరోధించేందుకు స్పీడ్ గన్ లను ఏర్పాటు చేయాలన్నారు.

ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, ఆర్డీవో శ్రీహరి రావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు

# ఓటు హక్కును సరి చూసుకోండి



- కూటమి నాయకులతో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఓటర్ల జాబితాలో ప్రతి ఒక్కరూ తమ ఓటును సరి చూసుకోవాలని, దీనిపై నాయకులు ఓటర్లకు దిశానిర్దేశం చేయాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ సూచించారు. బుధవారం స్థానిక తూర్పు కార్యాలయంలో కూటమి నాయకులతో ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలో నూతనంగా రూపొందించిన ఓటర్ల జాబితాపై చర్చించారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ కార్యక్రమం ద్వారా ఓటర్ల మ్యాపింగ్ పూర్తయిందని తెలిపారు. నూతనంగా ఓటు నమోదు చేసుకున్న వారు తమ ఓటు హక్కు లభించిందో లేదో పరిశీలించుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ప్రతి ఒక్కరూ దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహకారంతో రెండున్నరేళ్లలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అర్హులందరికీ చేరువ చేశామన్నారు. ప్రజలకు జరిగిన మంచి గురించి ప్రతి గడపకూ తెలియజేయాల్సిన బాధ్యత నాయకులదేనని స్పష్టం చేశారు. గుంటూరు మున్సిపాలిటీలో అత్యధిక మెజారిటీ కూటమి నాయకులు ఉంటే మరింత అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు, గుంటూరు నగరాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్ళేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

# గాంధీ జయంతి సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో ఖాదీ సంత

- ఖాదీ, చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలి
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్లపూడి రేణుక



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** "ఖాదీ ఫర్ నేషన్.. ఖాదీ ఫర్ ఫ్యాషన్" నినాదంతో గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న బీజేపీ ఆధ్వర్యంలో విజయవాడ ఐవీ ప్యాలెస్ ఫస్ట్ ఫ్లోర్‌లో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఖాదీ ఎగ్జిబిషన్, సంత నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్లపూడి రేణుక తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నేతృత్వంలో జరిగే ఈ కార్యక్రమానికి జాతీయ పార్టీ నియమించిన రాష్ట్ర ఇన్‌చార్జ్‌లు హాజరవుతారని, ఉదయం, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని చెప్పారు. గత ఏడాది విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతితో పాటు జిల్లా కేంద్రాల్లో ఖాదీ సంతలు నిర్వహించామని, విజయవాడ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరై ప్రోత్సహించారని తెలిపారు. ఖాదీ కేవలం వస్త్రం కాదని, స్వదేశీ, స్వావలంబన, ఆత్మగౌరవానికి ప్రతీక అని రేణుక పేర్కొన్నారు. స్వదేశీ ఉద్యమం నుంచి స్వాతంత్ర్య పోరాటంలో ఖాదీ కీలక పాత్ర పోషించిందని, గ్రామీణ కుటుంబాలకు, ముఖ్యంగా మహిళలకు ఉపాధి, ఆత్మగౌరవానికి ఆధారంగా నిలిచిందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఖాదీ, హ్యాండ్లూమ్, గ్రామీణ, కుటీర పరిశ్రమలకు మార్కెటింగ్, డిజిటల్ వేదికలు, ఆర్థిక సహాయం వంటి అంశాల్లో ప్రాధాన్యత పెరిగిందన్నారు. ఖాదీ రంగం టర్నోవర్ 2013--14లో సుమారు రూ. 33 వేల కోట్ల నుంచి ప్రస్తుతం రూ. 1.7 లక్షల కోట్లకు చేరిందని తెలిపారు. ఏపీ కూటమి ప్రభుత్వం నేతన్న హస్తం, నేతన్న పెన్షన్, విద్యుత్ రాయితీలు, రుణాలు, సబ్సిడీలు, గ్రాంట్ల ద్వారా చేనేత రంగానికి సహకరిస్తోందన్నారు. పొందూరు ఖాదీకి జీఐ గుర్తింపు లభించిందని, మంగళగిరి, వెంకటగిరి తదితర హ్యాండ్లూమ్ క్లస్టర్లను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని రేణుక అన్నారు. ఖాదీ, చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా రైతులు, నేతన్నలు, వారి కుటుంబాలకు ప్రత్యక్షంగా భరోసా కల్పించినట్లవుతుందని పేర్కొన్నారు. ప్రజలు కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులతో కలిసి అక్టోబర్ 2న ఖాదీ సంతకు హాజరై చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి చేనేత రంగానికి మద్దతు ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## వివిఐటిలో "వాద్ - వివాద్ 2026" సెమీఫైనల్స్




**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** యువతలో విశ్లేషణాత్మక ఆలోచనలు, సంభాషణ నైపుణ్యాలు మరియు వక్తృత్వాన్ని పెంపొందించేందుకు ఏఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలుగు మరియు ఇంగ్లీషు భాషలలో నిర్వహిస్తున్న వక్తృత్వ మరియు చర్చా పోటీల సెమీఫైనల్స్ వివిఐటి విశ్వవిద్యాలయంలో జరిగినట్లు వివిఐటియూ ప్రొ-ఛాన్సలర్ వాసిరెడ్డి మహాదేవ్ తెలిపారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ (మైభారత్), ఆంధ్రప్రదేశ్ యువజన సంక్షేమ శాఖ మద్దతుతో నిర్వహిస్తున్న ఈ పోటీలలో సెమీఫైనల్స్‌కు ఎంపికైన వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుండి 120 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. నిర్వాహక బృందం సెమీఫైనల్స్ కొరకు ప్రధాన ఇతివృత్తంగా అందించిన "21వ శతాబ్దంలో భారతదేశం ప్రపంచ వ్యవస్థలో మన దేశ గుర్తింపు మరియు ప్రాముఖ్యత" అనే అంశంపై విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. అనంతరం సెమీఫైనల్స్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ యువజన సంక్షేమ శాఖ కమిషనర్ మరియు శాప్ ఎండి, ఐఎఫ్ఎస్ అధికారిణి ఎస్. భరణి ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ భరణి మాట్లాడుతూ ?డిజిటల్ ప్రలోభాలకు దూరంగా ఉండాలని, పుస్తకాలు చదవడం ద్వారా నిజమైన జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. విద్యార్థులు, యువత స్మార్ట్‌ఫోన్‌లలో షార్ట్స్, రీల్స్ చూసి సంతోషం పొందుతున్నారని.. నిజమైన సంతోషం మనం పొందే విజయాల నుండి, సమాజానికి చేసే మంచి నుండి దక్కుతుందని పేర్కొన్నారు. వేదికలపై లేదా నలుగురిలో ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో మాట్లాడటానికి సరైన విషయ పరిజ్ఞానం అత్యంత ముఖ్యమైనదని అన్నారు. సోషల్ మీడియా విశ్వసనీయ సమాచారానికి మూలం కాదని, అది మన ఏకాగ్రతను దెబ్బతీసి విలువైన సమయాన్ని వృథా చేస్తుందని అన్నారు. వార్తాపత్రికలు, పుస్తకాలు చదవడం వల్ల ఏకాగ్రత పెరగడమే కాకుండా విషయ పరిజ్ఞానం విస్తరిస్తుందని తెలిపారు.

# 37 ఏళ్ల వైద్య సేవలకు వీడ్కోలు... డాక్టర్ పద్మావతి సేవలు చిరస్మరణీయం

- సౌమ్యంగా.. సమర్థవంతంగా పనిచేయడం ఆమె ప్రత్యేకత
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** వైద్య, ఆరోగ్యశాఖలో వివిధ హోదాల్లో 37 ఏళ్ల పాటు సేవలందిస్తూ ప్రజారోగ్యానికి విశేషంగా కృషి చేసిన డాక్టర్ పద్మావతి సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. సౌమ్యమైన వ్యవహారశైలితోనే కీలకమైన ప్రజారోగ్య విభాగాన్ని సమర్థవంతంగా నడిపించడం, ప్రభుత్వ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయించడం ఆమె ప్రత్యేకత అని కొనియాడారు. ప్రజారోగ్య శాఖ సంచాలకురాలిగా కీలక బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ పద్మావతి పదవీ విరమణ సందర్భంగా మంత్రి ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం డాక్టర్ పద్మావతి పదవీ విరమణ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సమయంలో డాక్టర్ పద్మావతి ప్రజారోగ్య విభాగంలో కీలక బాధ్యతల్లో ఉన్నారని తెలిపారు. ఆరోగ్యశాఖ అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో ఆమె పనితీరును దగ్గరగా గమనించానన్నారు.

"మొదట్లో ఆమె సౌమ్యమైన వ్యవహారశైలిని చూసి ఇంత పెద్ద విభాగాన్ని ఎలా నడిపిస్తారనే సందేహం కలిగింది. కానీ తర్వాత ఆమె పనితీరు చూసి నా అభిప్రాయం మారింది. కఠినంగా మాట్లాడకుండానే సిబ్బందితో సమర్థవంతంగా పనిచేయించవచ్చని ఆమె నిరూపించారు" అని మంత్రి అన్నారు. ప్రభుత్వ ఆదేశాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం, కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయించడం, సిబ్బందికి బాధ్యతలను స్పష్టంగా తెలియజేయడంలో ఆమె చూపిన చొరవను అభినందించారు.

**జాతీయ స్థాయిలో రాష్ట్రానికి గుర్తింపు**

ఆరోగ్యశాఖ బాధ్యత ఎంతో విస్తృతమైనదని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలోని దాదాపు 5 కోట్ల మంది ప్రజల ఆరోగ్యంతో ఈ శాఖకు ప్రత్యక్ష సంబంధం ఉందన్నారు. ఇలాంటి కీలక విభాగంలో సుదీర్ఘకాలం సేవలందించిన డాక్టర్ పద్మావతి రాష్ట్ర వైద్య, ఆరోగ్య సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు, ప్రోత్సాహకాలు లభించడంలో తనవంతు పాత్ర పోషించారని కొనియాడారు. ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తూనే ఉన్నత విద్యను అభ్యసించడం డాక్టర్ పద్మావతిలోని నేర్చుకోవాలనే తపనకు నిదర్శనమని మంత్రి అన్నారు. సాధారణ గిరిజన కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి వైద్యురాలిగా, ఉన్నతస్థాయి అధికారిగా ఎదగడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. పదవీ విరమణతో డాక్టర్ పద్మావతి అనుభవానికి ముగింపు కాదని మంత్రి అన్నారు.

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి జి.వీరపాండియన్ మాట్లాడుతూ పద్మావతి విధులు నిర్వహించిన తీరు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ పద్మావతి సేవలను ప్రశంసించారు. వైద్య సిబ్బంది తరచూ అనారోగ్యం పేరుతో విధులకు దూరంగా ఉండటం, సెలవులు తీసుకోవడం పెరుగుతోందని, దీనిపై ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మావతిని సహచర ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

# ఈహెచ్‌ఎస్ వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలి

- ఉద్యోగులు, కుటుంబ సభ్యులకు నిరంతర క్యాష్‌లెస్ వైద్యం అందించాలి
- ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు నాణ్యమైన, పారదర్శకమైన క్యాష్‌లెస్ వైద్య సేవలు నిరంతరాయంగా అందేలా ఎంప్లాయీస్ హెల్త్‌స్కీమ్ (ఈహెచ్ఎస్)ను మరింత బలోపేతం చేయాలని ఏపీ సచివాలయ సంఘం కోరింది. సెప్టెంబరు 29న ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్‌లో జరిగిన ఈహెచ్ఎస్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో సచివాలయ సంఘం అధ్యక్షులు జి. రామకృష్ణ, జనరల్ సెక్రటరీ నాపా ప్రసాద్ పాల్గొని ఉద్యోగుల వైద్య సౌకర్యాలకు సంబంధించిన పలు అంశాలను సీఈఓ పద్మావతి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం వైద్య చికిత్సల ఖర్చులు పెరిగిన నేపథ్యంలో ఈహెచ్ఎస్ ప్యాకేజీ రేట్లను సవరించాలని వారు కోరారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు క్యాష్‌లెస్ వైద్య సేవలు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించాలని, రాజధాని ప్రాంతంలోని సచివాలయం, హెచ్ఓడీ కార్యాలయాల ఉద్యోగుల సౌకర్యార్థం ఆయుష్, రమేష్, మణిపాల్, ఆంధ్ర హాస్పిటల్ సహా ప్రధాన ఆసుపత్రులన్నింటిలో ఈహెచ్ఎస్ కార్డులను ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగి చెల్లించే ఎంప్లాయీ కాంట్రిబ్యూషన్, ప్రభుత్వం చెల్లించే గవర్నమెంట్ కాంట్రిబ్యూషన్ ఈహెచ్ఎస్ ట్రస్ట్ ఖాతాలో జమ అయిన వెంటనే ఆ వివరాలను ఉద్యోగి రిజిస్టర్ చేసిన మొబైల్ నంబర్‌కు ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేసే విధానాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఉద్యోగి, కుటుంబ సభ్యుల పేర్లతో కూడిన డిజిటల్ ఈహెచ్ఎస్ హెల్త్ కార్డులను త్వరితగతిన అందించాలని, ఉద్యోగులకు వార్షిక ఆరోగ్య పరీక్షల (యాన్యువల్ హెల్త్ చెకప్) విధానాన్ని ప్రారంభించాలని సూచించారు.

అదేవిధంగా రిటైర్డ్ సీపీఎస్ ఉద్యోగులకు కూడా ఈహెచ్ఎస్ సదుపాయం కల్పించి హెల్త్ కార్డులు జారీ చేయాలని సచివాలయ సంఘం కోరింది. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు సమగ్ర వైద్య సేవలు అందేలా ఈహెచ్ఎస్ వ్యవస్థలో అవసరమైన మార్పులు చేసి, సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందుబాటులోకి తీసుకురావాలని జి. రామకృష్ణ, నాపా ప్రసాద్ కోరారు.

# బ్రెయిన్‌డెడ్ వ్యక్తి అవయవదానం.. పలువురికి కొత్త జీవితం

- జీవన్‌దాన్ సమన్వయంతో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌లో అవయవాల సేకరణ
- గత 24 గంటల్లో తొమ్మిది మందికి అవయవదానం ద్వారా కొత్త జీవితం
- అవయవదానంపై ప్రజల్లో మరింత అవగాహన అవసరం : డా. పోతినేని రమేష్ బాబు, డా. మమత రాయపాటి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** మానవత్వానికి నిదర్శనంగా గుంటూరుకు చెందిన 62 ఏళ్ల నల్లక భాస్కర తిరుమల బ్రెయిన్‌డెడ్ కావడంతో ఆయన కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకు వచ్చారు. మెదడులో రక్తస్రావం కారణంగా చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్ అయిన భాస్కర తిరుమల కుటుంబ సభ్యులకు జీవన్‌దాన్ కోఆర్డినేటర్లు అవయవదానంపై అవగాహన కల్పించారు. తీవ్ర విషాదంలో ఉన్నప్పటికీ కుటుంబ సభ్యులు మానవతా దృక్పథంతో అవయవదానానికి అంగీకరించారు.

భార్య ఎన్. వెంకట రమణమ్మ, కుమారుడు ఎన్. మోహన కృష్ణ, కుమార్తె హేమలత, మనుమలు సుహాస్, జస్విక్ నందన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. వారి నిర్ణయంతో అవయవ మార్పిడి కోసం ఎదురుచూస్తున్న పలువురు రోగులకు కొత్త జీవితంపై ఆశ కలిగింది. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, గుంటూరులో జీవన్‌దాన్ బృందం సమన్వయంతో వైద్య నిపుణులు నిర్దేశిత వైద్య విధానాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా అవయవ సేకరణ ప్రక్రియను చేపట్టారు.

ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఎండీ డా. పోతినేని రమేష్ బాబు మాట్లాడుతూ, తీవ్ర విషాద సమయంలోనూ కుటుంబ సభ్యుని అవయవాలను దానం చేసేందుకు ముందుకు వచ్చిన కుటుంబ సభ్యుల ధైర్యాన్ని, మానవతా దృక్పథాన్ని అభినందించారు. వారి నిర్ణయం సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గత 24 గంటల్లో ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో అవయవదానం ద్వారా తొమ్మిది మందికి కొత్త జీవితం అందించడం ఎంతో సంతృప్తినిచ్చే విషయమన్నారు.

డా. మమత రాయపాటి మాట్లాడుతూ, అవయవదానం మరొకరికి జీవితాన్ని అందించే మహత్తరమైన బహుమతి అని పేర్కొన్నారు. అవయవదానంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అవసరమైన వారికి కొత్త జీవితాన్ని అందించేందుకు ప్రజలు అవయవదానానికి ముందుకు రావాలని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ పిలుపునిచ్చింది.

# రాయలసీమ అభివృద్ధి...బీజేపీ ప్రధాన అజెండా

- కూటమి ప్రభుత్వంలో ఉద్యాన రంగ అభివృద్ధితో రాయలసీమకు మహర్దశ
- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** రాయలసీమ అంటే కేవలం కరువు ప్రాంతం కాదని, అపారమైన వనరులు, ఉద్యాన పంటలకు అనుకూలమైన భూములు ఉన్న ప్రాంతమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు అన్నారు. రైతు సంక్షేమం, ముందుచూపుతో కూడిన సాగునీటి విధానాలతో కరువు ప్రాంతంలోనూ బంగారం పండించవచ్చని పేర్కొన్నారు. గతంలో డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా తక్కువ నీటితో అరటి, బొప్పాయి, దానిమ్మ వంటి వాణిజ్య పంటలను సాగు చేసే అవకాశం ఏర్పడిందన్నారు. అక్టోబర్ 2న మదనపల్లిలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో హార్టికల్చర్ హబ్‌కు సంబంధించిన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరగనున్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

రాయలసీమలో ఉద్యాన సాగును 8.4 లక్షల హెక్టార్ల నుంచి 2030 నాటికి 14.41 లక్షల హెక్టార్లకు, ఉద్యాన పంటల ఉత్పత్తిని 435 లక్షల టన్నులకు పెంచే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని రమేష్‌నాయుడు తెలిపారు. ఉద్యాన రంగానికి మౌలిక సదుపాయాలు, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నామని, కేంద్రం నుంచి సుమారు రూ. 40,352 కోట్ల సహకారం, ప్రైవేట్ రంగం నుంచి రూ. 59 వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. మదనపల్లి టమోటా, చింతపండు, అరటి, బత్తాయి వంటి పంటలకు ప్రాసెసింగ్, నిల్వ, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించి ప్రపంచ స్థాయి మార్కెట్లు, ఎగుమతి అవకాశాలు అందుబాటులోకి తేవాలని అన్నారు. రవాణా, రైల్వే, డిజిటల్ మార్కెటింగ్ వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

గత ప్రభుత్వ హయాంలో డ్రిప్ ఇరిగేషన్, వ్యవసాయ పరికరాలపై రాయితీలు తగ్గించారని, జీవో 365 ద్వారా రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు ప్రతికూల నిర్ణయాలు తీసుకున్నారని రమేష్ నాయుడు విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి, కరువు ఛాయలను తొలగించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణంతో పాటు భవిష్యత్తులో వరద నష్టం నివారణకు సర్వేలు జరుగుతున్నాయని, వెలిగొండ ప్రాజెక్టు ద్వారా బద్వేల్ ప్రాంతానికి కృష్ణా జలాలు అందే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. పరిశ్రమలు, మౌలిక వసతులు, సాగునీరు అభివృద్ధి చెందితే యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రాంతీయ, కుల, భావోద్వేగ విభేదాలకు దూరంగా ఉండి రాయలసీమ అభివృద్ధి, రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ, అక్టోబర్ 2న మదనపల్లిలో జరిగే కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

# బుర్రిపాలెంలో పర్యటించిన ఉన్నత అధికారులు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** తెనాలి మండలం బుర్రిపాలెంలో ఉన్నత అధికారులు బుధవారం పర్యటించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు అక్టోబర్ 4వ తేదీన పి.ఎం.ఏ.వై గ్రామీణ్ క్రింద మంజూరైన గృహ నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి హెప్సీబా రాణి కొర్రపాటి, జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ, కేంద్ర మంత్రి పి.ఎస్ ఏ.కె. సింగ్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో ఏర్పాట్లు పరిశీలించారు. బుర్రిపాలెం గ్రామం పొలిమేరల్లో బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నారు. గ్రామంలో శంకుస్థాపన చేసిన అనంతరం, పలువురు లబ్ధిదారులతో మాట్లాడవచ్చని భావిస్తున్నారు. వీటన్నింటి దృష్ట్యా ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఐదు వేల మంది వం-కు ప్రజలు బహిరంగ సభకు హాజరు కావచ్చని అందుకు తగిన విధంగా తాగు నీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇప్పటికే జిల్లా పంచాయతీ అధికారి సాయి కుమార్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రహదారి మరమ్మతుల పనులు ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీర్ ఆర్. శ్రీనివాస మూర్తి నేతృత్వంలో చేపడుతున్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. జ్యోతి బసు, జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి సి. హెచ్. కృష్ణ, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీరమణి, గుంటూరు రెవిన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాస రావు, ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీర్ ఆర్. శ్రీనివాస మూర్తి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె. కళ్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జె.వి.ఎస్. ఆర్.కె. ప్రసాద్, జిల్లా పౌర సరఫరాల అధికారి పి. కోమలి పద్మ, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి. విజయ లక్ష్మి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి. శంకర్, తహసిల్దార్ గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వరల్డ్ ర్యాంకింగ్స్‌లో ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి గుర్తింపు



- టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్‌లో 1001-1200 శ్రేణిలో స్థానం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అంతర్జాతీయంగా మరో ప్రతిష్టాత్మక గుర్తింపును సొంతం చేసుకుంది. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఀఎజు) సంస్థ విడుదల చేసిన వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2027లో తొలిసారిగా పాల్గొన్న ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ మొదటి ప్రయత్నంలోనే 1001-1200 శ్రేణిలో స్థానం సంపాదించింది. పదేళ్లలోపే ఈ స్థాయి అంతర్జాతీయ గుర్తింపును సాధించిన ప్రైవేట్ విశ్వవిద్యాలయంగా ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రత్యేకతను చాటుకుంది. వర్సిటీలో పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు, ప్రత్యేక ప్రణాళికలతో కూడిన నాణ్యమైన విద్యా బోధనను అమలు చేస్తున్నామని యూనివర్సిటీ క్వాలిటీ అస్యూరెన్స్ అండ్ ర్యాంకింగ్స్ అసోసియేట్ డీన్ డాక్టర్ కార్తిక్ రాజేంద్రన్ తెలిపారు. అంతర్జాతీయ విద్యా, పరిశోధనా రంగాల్లో యూనివర్సిటీకి పెరుగుతున్న ప్రాధాన్యత, పరిశోధనల నాణ్యత, విద్యా ప్రమాణాలు తదితర అంశాలు ఈ గుర్తింపునకు దోహదపడ్డాయని పేర్కొన్నారు. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లోని ఇంటర్నేషనల్ అవుట్‌లుక్ విభాగంలో 58.5 స్కోరు సాధించడం ద్వారా ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ దేశంలో ఐదో స్థానంలో నిలిచిందని డాక్టర్ కార్తిక్ రాజేంద్రన్ తెలిపారు. అలాగే రీసెర్చ్, క్వాలిటీ విభాగంలో 55.4 స్కోరు సాధించినట్లు వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లో తొలిసారిగా స్థానం సాధించడం యూనివర్సిటీ విద్యా, పరిశోధనా ప్రమాణాలకు గుర్తింపుగా భావిస్తున్నామని ఆయన తెలిపారు. భవిష్యత్తులో అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో మరిన్ని విద్యా, పరిశోధనా భాగస్వామ్యాలను పెంపొందించడంతో పాటు, పరిశోధనల నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు చర్యలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య సతీష్ కుమార్ మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం సంతోషకరమని అన్నారు. విద్యా బోధన, పరిశోధన, అంతర్జాతీయ సహకారాల్లో నాణ్యతా ప్రమాణాలను మరింత పెంచేందుకు విస్తృతంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్యా అవకాశాలను అందించడంతో పాటు, విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ విద్యా, పరిశోధనా వేదికగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com